దీన్నిబట్టి ఆంక్షలు విధించడం అంటే అది ప్రచ్ఛన్న యుద్ధం సాగించడమే. అంతే కాదు, ప్రత్యక్ష యుద్ధం కన్నా ఎక్కువ ప్రమాదకరం. కాని పైకి అలా కనపడదు. ఆంక్షల ఫలితంగా ఆస్పత్రులలో అవసరమైన ఔషధాలు లభించక మరణించేవారి సంఖ్య పెరిగిపోతుంది. సరైన తిండి లేక మరణించేవారి సంఖ్య పెరుగుతుంది. లేదా, జబ్బుల పాలయేవారి సంఖ్య పెరిగిపో తుంది. కాని ఈ ప్రభావం యుద్ధంలో బాంబు దాడుల వలన మరణాలు సంభవించినట్టుగా కొట్టొచ్చినట్టు కనిపించదు. ఈ పరిస్థితులన్నీ ఇప్పుడు రష్యాలో నెలకొన్నాయని చెప్పలేం. రష్యా ఈ ఆంక్షలను తట్టుకోగలుగుతోంది. సోవియట్ యూనియన్ కాలం నుండీ అందివచ్చిన వారసత్వంగా రష్యాకు అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థఉంది. నిజానికి సామ్రాజ్యవాద దేశాలు ఒక అభివృద్ధి చెందిన దేశం మీద ఆంక్షలు విధించినది తొలిసారిగా రష్యా పైనే. బలహీనంగా ఉండే మూడవ ప్రపంచదేశాల కన్నా రష్యా ఈ ఆంక్షలను తట్టు కోగలుగుతోంది. పైగా ఏకకాలంలో పలు దేశామీద ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీని వలన ఆ ఆంక్షల ప్రభావం పలుచనైపోతోంది.

అయితే, ఈ కారణాల రీత్యా ఆంక్షలను తక్కువ చేసి చూడనక్కరలేదు. ఈ ఆంక్షలు మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద ప్రయోగించడానికి సామ్రాజ్యవాదులు సిద్ధం చేసివుంచుకున్న ఒక అత్యంత ప్రమాదకర ఆయుధం. ఈ విధంగా ఏకపక్షంగా ఆంక్షలను విధించడాన్ని ఐరాస నిషేధించాల్సిందే. ఐతే, అటువంటి నిషేధాలేవీ ఐరాస భద్రతా మండలి ఆమోదం లేకుండా అమలు లోకి రావన్నది తెలిసినదే. ఐనప్పటికీ, ఐరాస ఆంక్షలను నిషేధించడం అనేది ఒక నైతిక బలాన్ని బాధిత దేశాలకు సమకూరుస్తుంది. భారత దేశాన్ని రష్యా మీద జరిగే ఆర్థిక యుద్ధంలో చురుకైన భాగస్వామిగా మార్చాలన్నదే జెలెన్‌స్కీ ప్రతిపాదన సారాంశం. ఇది యుద్ధ నేరానికి తోడ్పడటం కన్నా తక్కువేమీ కాదు.

అయితే, ఈ కారణాల రీత్యా ఆంక్షలను తక్కువ చేసి చూడనక్కరలేదు. ఈ ఆంక్షలు మూడవ ప్రపంచ దేశాల ప్రజల మీద ప్రయోగించడానికి సామ్రాజ్యవాదులు సిద్ధం చేసివుంచు కున్న ఒక అత్యంత ప్రమాదకర ఆయుధం. ఈ విధంగా ఏకపక్షంగా ఆంక్షలను విధించడాన్ని ఐరాస నిషేధించాల్సిందే. ఐతే, అటువంటి నిషేధాలేవీ ఐరాస భద్రతా మండలి ఆమోదం లేకుండా అమలు లోకి రావన్నది తెలిసినదే. ఐనప్పటికీ, ఐరాస ఆంక్షలను నిషేధించడం అనేది ఒక నైతిక బలాన్ని బాధిత దేశాలకు సమకూరుస్తుంది. భారత దేశాన్ని రష్యా మీద జరిగే ఆర్థిక యుద్ధంలో చురుకైన భాగస్వామిగా మార్చాలన్నదే జెలెన్‌స్కీ ప్రతిపాదన సారాంశం. ఇది యుద్ధ నేరానికి తోడ్పడటం కన్నా తక్కువేమీ కాదు.

(స్వేచ్ఛానుసరణ)

కంగనా నోటిదురుసు- బీజేపీ కంగారు

నోటి దురుసు సెలబ్రిటీగా పేరు మోసిన నటి కంగనా రనౌత్ ఇందిరాగాంధీ పాత్రలో నటించి, దర్శకురాలిగా ఉన్న 'ఎమర్జన్సీ' సినిమా బీజేపీకి తలనొప్పిగా మారింది. చరిత్రను వక్రీకరించటమే గాక తమను దేశద్రోహులు, ఉగ్రవాదులుగా చిత్రీకరించారని, అది తమపై విద్వేషాన్ని రెచ్చగొట్టే అవకాశం ఉన్నందున ఆ చిత్రంపై నిషేధం విధిం చాలంటూ దేశవ్యాపితంగా సిక్కులు డిమాండ్ చేస్తున్నారు. ఖలిస్తాన్ మద్దతుదార్లు కంగనాను చంపివేస్తామంటూ బెదిరింపులకు దిగారని వార్తలు. దీంతో ఈనెల ఆరున విడుదల తేదీని ప్రకటించిన కంగనా ఇప్పుడు దానికి సెన్సార్ బోర్డు ఆమోదం తెలిపినా కొందరి ఒత్తిడి కారణంగా ధృవీకరణ పత్రం నిలిపివేశారని చెబుతున్నారు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితం, ఆమె ప్రధానిగా ఉన్నప్పుడు 21 నెలల అత్యవసర పరిస్థితి విధింపు తదితర అంశాల ఆధారంగా ఈ సినిమా తీసినట్లు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఆగస్టు 14వ తేదీన ట్రైలర్‌ను విడుదల చేయగా 50 లక్షల మంది చూశారని, కేవలం 461 మంది మాత్రమే ఇష్టపడి నట్లు నమోదైనట్లు 'ఇండియాటుడే' పేర్కొన్నది. ప్రతి ఒక్క ఓటునూ లెక్కించుకుంటున్న బీజేపీ ఇప్పటికే దేశంలో ఉన్న మూడు కోట్ల మంది సిక్కులు వ్యతి రేకంగా ఉన్నారు. ఈ సినిమాతో వారు మరింత దూరమౌతారని, పక్కా వ్యతిరేకులుగా మారతారని ఆ పార్టీ భయపడు తోంది. అక్టోబరులో జరిగే హర్యా నా, కాశ్మీరు ఎన్నికలపై ప్రతికూల ప్రభావం పడు తుందని భావిస్తున్నారు. గతంలో బీజేపీ మిత్ర పక్షంగా ఉన్న అకాలీదళ్ కూడా అదే డిమాండ్ చేసింది.

బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వివాదాస్పద వ్యాఖ్యలకు పేరుమోసిన సంగతి తెలిసిందే. రైతుల గురించి నోరుపారవేసుకున్న ఉదంతం సమసిపోక మందే కులగణన గురించి చేసిన వ్యాఖ్యలతో తమకు సంబంధం లేదని బీజేపీ చెప్పుకుంది. ఆ పార్టీలో ఇలాంటి వారికి కొదవలేదు. అవి పార్టీ కొంప ముంచుతున్నాయి. ఆగస్టు చివరి వారంలో దైనిక్ భాస్కర్ అనే పత్రికతో మాట్లాడిన కంగన 2020-21లో జరిగిన రైతు ఉద్యమం గురించి నోరు పారవేసుకున్నారు. ఆ సందర్భంగా మృతదేహాలు వేలాడాయని, మానభంగాలు జరిగాయని ఆరోపించారు. రైతు ఉద్యమం జరిగిన హర్యానాలో లోక్‌సభ ఎన్నికల్లో పదికి గాను ఐదు సీట్లు పోగొట్టుకున్న బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దూరం కానుందనే భయంతో ఉంది. సరిగ్గా ఈ తరుణంలో ఆమె చేసిన వ్యాఖ్యలు హర్యానా రైతాంగాన్ని మరింతగా రెచ్చగొట్టేవే. పార్టీకి నష్టం కలిగిస్తాయని హర్యానా పార్టీ నేతలు గగ్గోలు పెట్టారు. దాంతో కేంద్ర బీజేపీ వెంటనే కంగనామాటలతో పార్టీకి సంబంధం లేదని చెప్పుకుందే, తప్ప కనీసంగా ఆమెను మందలించలేదు. బంగ్లాదేశ్‌లో మాదిరి పరిస్థితిని భారత్‌లో సృష్టించే పథకం ఉందని, రైతుల నిరసనల వెనుక చైనా, అమెరికా హస్తం ఉందని కూడా అంతకు ముందు ఆరోపించారు. పార్టీ విధానాల గురించి ప్రకటనలు చేసేందుకు కంగనా రనౌత్‌కు అధికారం లేదా అనుమతి ఇవ్వలేదని, భవిష్యత్‌లో అలాంటి ప్రకటనలు చేయకూడదని కోరినట్లు బీజేపీ ప్రకటించింది. తాను నటించిన ఎమర్జన్సీ సినిమా గురించి ప్రచారం చేసుకొనేందుకు దైనిక భాస్కర్ పత్రికతో మాట్లాడినపుడు ఈ వ్యాఖ్యలు చేశారు. అందరూ వాటిని ఎక్కడ చదవరనో లేదా మరింత ప్రచారం కోసమో సదరు పత్రిక వార్తను తన 'ఎక్స్' ఖాతాలో ఆగస్టు 25న పోస్టు కూడా చేశారు. లోక్‌సభ ఎన్నికల పుడు హర్యానా మాజీ ముఖ్యమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను బీజేపీ తరఫున గ్రామాల్లో ప్రచారానికి అక్కడి రైతులు రానివ్వని ఉదంతాలను చూసిన బీజేపీ నేతలు కంగన మాటలతో తమ పని అయిపోయినట్లే భావించారు. నష్ట నివారణ చర్య తీసుకున్నప్పటికీ కంగన మాటలు రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఒక అస్త్రంగా మారటం అనివార్యం. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీ ఒక తీర్మానం కూడా చేసింది. రెండవసారి శంభు సరిహద్దులో ఆందోళన ప్రారంభించి రెండు వందల రోజుల సందర్భంగా జరిగే నిరసనకు రెజ్లర్ వినేష్ ఫోగట్ రానున్నట్లు వార్తలు.



ఆగస్టు చివరి వారంలో దైనిక్ భాస్కర్ అనే పత్రికతో మాట్లాడిన కంగన 2020-21లో జరిగిన రైతు ఉద్యమం గురించి నోరు పారవేసుకున్నారు. ఆ సందర్భంగా మృతదేహాలు వేలాడాయని, మానభంగాలు జరిగాయని ఆరోపించారు. రైతు ఉద్యమం జరిగిన హర్యానాలో లోక్‌సభ ఎన్నికల్లో పదికి గాను ఐదు సీట్లు పోగొట్టుకున్న బీజేపీ అసెంబ్లీ ఎన్నికల్లో అధికారం దూరం కానుందనే భయంతో ఉంది. సరిగ్గా ఈ తరుణంలో ఆమె చేసిన వ్యాఖ్యలు హర్యానా రైతాంగాన్ని మరింతగా రెచ్చగొట్టేవే. పార్టీకి నష్టం కలిగిస్తాయని హర్యానా పార్టీ నేతలు గగ్గోలు పెట్టారు. దాంతో కేంద్ర బీజేపీ వెంటనే కంగనామాటలతో పార్టీకి సంబంధం లేదని చెప్పుకుందే, తప్ప కనీసంగా ఆమెను

రైతులపై నోరు పారవేసుకున్న కంగనా మాటలు ఇంకా చెవుల్లో గింగురు మంటుండగా తగ్గేదేలే అంటూ కులగణన జరగదు అని మరొక ప్రకటన వదిలారు. వెంటనే అది మా వైఖరి కాదంటూ దానికి కూడా జనానికి బీజేపీ సంజాయిషీ చెప్పుకోవాల్సి వచ్చింది. 'న్యూస్ 24' అనే టీవీతో మాట్లాడుతూ కులగణన తప్పకుండా చేయాలా అన్న ప్రశ్నకు అవసరమే లేదు అంటూ కంగన చెప్పేశారు. కులగణన మీద యోగి ఆదిత్యనాథ్ వైఖరే తనదని, అందరం కలసి ఉంటేనే మంచిదని, విడిపోతే నాశనం అవుతామన్నారు. "కులగణన జరపకూడదు. నటుల కులమేమిటో మనకు తెలియదు. ఎవరికీ ఏమీ తెలియదు. నా చుట్టూ ఉన్నవారు కులం గురించి పట్టించుకోరు. దాన్ని ఎందుకు ఇప్పుడు తేల్చాలి. గతంలో మనం చేయలేదు, ఇప్పుడూ అవసరం లేదు" అన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కావాలంటే రాష్ట్రాలు కుల గణన చేసుకోవచ్చు తప్ప కేంద్ర ప్రభుత్వం చేపట్టదని, ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని బీజేపీ నేతలు పదే పదే చెప్పిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఎన్నికలకు ముందు మరోసారి ఎన్డీయే కూటమిలో చేరిన జెడియు నితీష్‌కుమార్ బీహార్‌లో కులగణన చేశారు. అనేక రాష్ట్రాలలో అలాంటి డిమాండ్ ముందుకు వచ్చింది. కేంద్రమే జనాభా లెక్కలతో పాటు జరపాలని ప్రతిపక్ష పార్టీలు కోరాయి. ఎన్నికలో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రాలేదు, మిత్రపక్షాల మీద ఆధార పడాల్సి వచ్చింది. దాంతో వాటి ఒత్తిడికి లొంగిపోయింది. కంగన ప్రకటన మరోసారి బీజేపీని ఇరుకున పెట్టింది. "అవసరం తలెత్తితే తాము కులగణన చేస్తామని హోంమంత్రి చెప్పారని, కనుక కంగన చెప్పిన మాటలు పార్టీ వైఖరిని ప్రతిబింబించవు" అని బీజేపీ జాతీయ ప్రతినిధి గురు ప్రకాష్ పాశ్వాన్ ప్రకటించాల్సి వచ్చింది. అయితే ఇంతవరకు కుల గణన చేస్తామని కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

తోటకూర నాడే మందలించి ఉంటే అనే సామెత తెలిసిందే. గతంలో కంగనా రనౌత్ చేసిన అనేక వివాదాస్పద ప్రకటనలు, ప్రత్యర్థులపై ఎదురు దాడికి దిగినపుడు బీజేపీ నోరు మెదపలేదు. దాడి జరపటాన్ని ఆస్వాదించింది. పరిస్థితి మారిన తరువాత ఇప్పుడు ప్రతి మాట వల్లా పార్టీకి ఎదురు దెబ్బ తగులుతోంది. అయినా సరే. ఆమె ఎక్కడా తగ్గటం లేదు. తన సినిమా గురించి ప్రచారం చేసుకుంటూ చౌకబారు, తెలివి తక్కువ ప్రకటనలు, వివాదాస్పద వ్యాఖ్యలతో ఉచిత ప్రచారం పొందాలని చూస్తున్నట్లు కనిపిస్తున్నది. నరేంద్ర మోడీ అధికారానికి వచ్చిన 2014లోనే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని 2021లో చెప్పారు. స్వీయ అనుభవంతో తానీ మాటలు చెబుతున్నట్లు, తన అతి మంచితనం కారణంగా వ్యవస్థ తనను దేశం విడిచి అమెరికా వెళ్లేట్లు చేసిందని, మోడీ అధికారానికి వచ్చాక తాను తిరిగి వచ్చానని అందుకే అసలైన స్వాతంత్ర్యం వచ్చినట్లు భావిస్తున్నట్లు చెప్పుకున్నారు. అదే విధంగా కత్రీనా కైఫ్ వంటి విదేశీ హీరోయిన్లు ఎంతో రాణించారని కానీ 2014 తరువాత స్వదేశీ నటీనటులు, కథలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, విదేశీయుల నృత్యాలు ఆపాలని జనం చెప్పారని, ఇటాలియన్ ప్రభుత్వాన్ని తొలగించి ఒక చారువాలాను ప్రధానిని చేశారని కూడా సెలవిచ్చారు. సుభాస్ చంద్రబోస్‌ను భారత తొలి ప్రధాని అని చెప్పటమే కాదు, ఆయన అజాద్ హింద్ ప్రభుత్వాన్ని ఏర్పరచిన కారణంగా బోసే ప్రథమ ప్రధాని అని సమర్థించుకున్నారు. తనను విమర్శించిన వారికి రెండు రకాల మెదడు కణాలు ఉంటాయని వారికి ఇది అర్థం కాదని కూడా ఎదురు దాడి చేశారు. రామనాథ్ కోవింద్‌ను 'కోవిడ్'గా పలకటమేగాక, ప్రథమ దళిత రాష్ట్రపతిగా వర్ణించి తరువాత నాలుక కరుచుకున్నారు. అలాంటి కంగనా సినిమా ఎమ ర్జన్సీ గురించి సెన్సార్ బోర్డు ఏం చేస్తుందో, బీజేపీ ఏం చెబుతుందో వాటి మీద స్పందనలు ఎలా ఉంటాయో వేచిచూడాల్సిందే!

- సత్య

దేశవ్యాప్తంగా ఏఐఐఈఏ (అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం)కి చెందిన యూనిట్లు దాదాపు 300 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి బీమా రంగంపై జీఎస్టీ భారాన్ని తగ్గించమని వినతి పత్రాలు అందజేశాయి. ఈ ఏడాది యూనియన్ బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా దీనిపై చర్చించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌ను విపక్షాలు పట్టుబట్టాయి. అయితే దీనికి సమాధానం చెప్పకపోగా కేంద్రం వ్యూహాత్మక మౌనం పాటించింది. నేటికీ ఒక నిర్ణయంగానీ, పరిష్కార మార్గంగానీ లభించలేదు. బీమా ప్రీమియంపై 18 శాతం పన్ను విధించడాన్ని వ్యతిరేకిస్తూ గత ఏడేండ్లుగా (ఏఐఐఈఏ) స్ఫూర్తిదాయక పోరాటాన్ని కొనసాగిస్తున్నది. బీమా రంగంలో జీఎస్టీ భారాన్ని తగ్గించాలని ఉద్యోగులు, ఏజెంట్లతో కలిసి దేశవ్యాప్తంగా 46 లక్షల పాలసీదారుల చేత ఆ నాటి ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీకి లేఖలు రాయించింది. దాదాపు 400 మంది పార్లమెంట్ సభ్యులను కలిసి వినతి పత్రాలను అందజేసింది. అనేక రాష్ట్రాలలో ఉన్న ఆర్థిక మంత్రులను కలిసి ఈ అంశాన్ని జీఎస్టీ కౌన్సిల్‌లో చేపట్టమని అభ్యర్థించింది.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల ఆర్థిక మంత్రులకు యూనియన్ తరపున వినతి పత్రాలు సమర్పించింది. కేరళ, తమిళనాడు

బీమాపై జీఎస్టీ- బీజేపీ విన్యాసాలు



ఆర్థిక మంత్రులు జీఎస్టీ కౌన్సిల్‌లో ఈ అంశాన్ని లేవనెత్తే ప్రయత్నం చేసినా దానికి కేంద్రం అంగీకరించలేదు. గత పార్లమెంట్‌లోనూ, ప్రస్తుత పార్లమెంట్‌లోనూ అనేకమంది పార్లమెంట్ సభ్యులు ఈ అంశాన్ని ప్రస్తావించినా, జీఎస్టీ కౌన్సిల్‌లో కేంద్ర అనుమతి లేకుండా ఏ ప్రతిపాదన ఆమోదం పొందే అవకాశం లేకపోవడంతో ఈ అంశం అపరిష్కృతంగానే ఉంది.

బీమా రంగాన్ని ప్రోత్సహించాలి

ఆహారం, దుస్తులు, నివాసం తర్వాత, సామాజిక భద్రత ప్రజలకు ముఖ్యమైన అవసరం. సార్వత్రిక భద్రత లోపించిన మన దేశంలో బీమా రంగం ప్రజలకు సామాజిక భద్రత అందించే ముఖ్యమైన సాధనం. కనుక, కేంద్రమే బీమారంగాన్ని ప్రోత్సహించాలి. పన్ను రాయితీలు ఇవ్వడం ద్వారా బీమా పథకాల ద్వారా పొదుపును ప్రోత్సహించాలి. అప్పుడు మాత్రమే బీమా పాలసీలను కొనుగోలు చేయడానికి బీమా చేయదగిన ప్రజలు ఆకర్షితులవుతారు. ఇది దేశంలో ఎక్కువ బీమా వ్యాప్తికి సహాయ పడుతుంది. పాలసీదారు అకాల మరణం సంభవించినప్పుడు అతని కుటుంబానికి అవసరమైన ఆర్థిక భద్రతను అందించడమే కాకుండా, దేశ నిర్మాణ కార్యకలాపాల కోసం ప్రజల దీర్ఘకాలిక పొదుపును పెట్టుబడి పెట్టడంలో ప్రభుత్వానికి సహాయం చేస్తుంది.జీవిత బీమా ఉత్పత్తులపై జీఎస్టీని నిర్ణయించేటప్పుడు ప్రభుత్వం ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని అందరూ భావించారు. జీవిత బీమా ఉత్పత్తులు, ప్రీమియంలపై అంత పెద్ద మొత్తంలో జీఎస్టీ విధించడం పాలసీదారులపై భారం మోపడమే అవుతుంది. అంతేగాక వారి పొదుపును నిరుత్సాహ పరుస్తుంది. బీమా పరిశ్రమ వృద్ధికి ఇది ప్రతిబంధకంగా మారుతున్నది. దేశంలో అందరికీ సామాజిక భద్రత లేని పరిస్థితుల్లో, బీమా చేయించుకోవడం తప్పనిసరి అవుతుంది. అన్ని నిత్యవసర వస్తువులు, సేవలు జీఎస్టీ పరిధిలోంచి తప్పిస్తున్న నేపథ్యంలో, బీమా ప్రీమియంపై ఇంత పన్ను భారం మోపడం సహేతుకంగా లేదని ఐఆర్‌డిఏ (బీమా నియంత్రణ సంస్థ) పూర్వ సభ్యులు నీలేష్ సాఠే అభిప్రాయపడ్డారు. ప్రపంచంలో ఏ దేశంలో కూడా బీమా ప్రీమియం మీద ఇంత పన్ను వేయట్లేదని, యాన్యుటీ పాలసీలపై కూడా ఇంత పన్ను భారమా అని నీలేష్ సాఠే వాపోయారు.విలాస వస్తువులైన బంగారంపై 3 శాతం, నగిషీ చెక్కిన డైమండ్లపై 0.25 శాతం పన్ను విధిస్తూ, ప్రాణాధార మందులు, ప్రాణ వాయువుపై 12 నుండి 18 శాతం జీఎస్టీ భారమా?ప్రజలకు సామాజిక భద్రత, ఆరోగ్య బీమా సేవలు అందిస్తున్న బీమా రంగంపై 18 శాతం జీఎస్టీనా? ప్రపంచంలో ఏ దేశంలో కూడా సామాజిక భద్రతపై 18 జీఎస్టీ పన్ను లేదు. ప్రజల పొదుపుపై అధిక జీఎస్టీ విధించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి!

దేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసిది కీలకపాత్ర

31 మార్చి 2023 నాటికి ఎల్ఐసి మన దేశ ఆర్థిక వ్యవస్థలో రూ.43,97,204.59 కోట్ల పెట్టుబడులు పెట్టింది. ఇందులో రూ. 31,37,315 కోట్ల నిధులను కేంద్ర, రాష్ట్ర సెక్యూరిటీలలో, హౌసింగ్, నీటిపారుదల సౌకర్యాల కల్పన కోసం ఎల్ఐసి కేటాయించింది. దేశీయ బీమా రంగంలో ప్రయివేటు బీమా కంపెనీల ప్రవేశం జరిగి 24 ఏండ్లయినా, ఎల్ఐసి ప్రీమియమ్ ఆదాయంలో దాదాపు 60 శాతం మార్కెట్ వాటా, పాలసీలలో 72 శాతం మార్కెట్ వాటాతో ఇప్పటికీ మార్కెట్ లీడర్‌గా ముందుకు సాగుతోంది. ఎల్ఐసి ద్వారానే కేంద్ర ప్రభుత్వానికి ఏటా లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు అందుతున్నాయి. ప్రభుత్వ అంతర్గత నిధుల సమీకరణలో ఎల్ఐసి వాటా 25 శాతం పైబడి ఉంది.'స్విస్ రే' సంస్థ అంచనాల ప్రకారం 2032 నాటికి భారత్ ప్రపంచంలో ఆరవ అతి పెద్ద బీమా మార్కెట్‌గా ఎదగనుంది. 2021లో కోవిడ్ మహమ్మారి దెబ్బకు మన దేశంలో 22.5 శాతం ఆరోగ్య బీమా ప్రీమియమ్‌లు అధికమయ్యాయి. 2022లో ఆర్థిక వ్యవస్థ కోవిడ్ తదనంతర పరిస్థితుల నుంచి కోలుకున్నాక, మోటార్ ప్రీమియమ్‌లు సైతం దాదాపు 2.9 శాతం పైబడి పెరిగాయి. మరి ఆరోగ్య బీమాపై, థర్డ్ పార్టీ ప్రీమియంపై 18 శాతం పన్ను భారం మోపడం, ప్రజలు తమకు తాము కల్పించుకునే సామాజిక భద్రతపై భారం వేయడం కాదా!! ఇప్పటికైనా మోడీ, బీజేపీ అండ్ కో బీమాపై విధించిన జీఎస్టీ విషయమై చేస్తున్న విన్యాసాలు, ఆడుతున్న నాటకాలు మానుకోవాలి. జీఎస్టీ భారాన్ని తగ్గించాలి. ప్రభుత్వ బీమా రంగాన్ని ప్రోత్సహించాలి.

- పి.సతీష్, 9441797900

లాసెట్‌లో 5,363 మందికి సీట్ల కేటాయింపు

- ఆరు వరకు కాలేజీల్లో చేరేందుకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో మొదటి విడత సీట్లు కేటాయించారు. ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్‌ఎల్‌బీ మూడేండ్ల కోర్సులో 4,285 సీట్లు, ఎల్‌ఎల్‌బీ ఐదేండ్ల కోర్సులో 2,039 సీట్లు కలిపి మొత్తం 6,324 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 14,817 మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని పేర్కొన్నారు. ఎల్‌ఎల్‌బీ మూడేండ్ల కోర్సుల్లో 3,901 మంది, ఎల్‌ఎల్‌బీ ఐదేండ్ల కోర్సులో 1,462 మంది కలిపి మొత్తం 5,363 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. కేటాయించిన కాలేజీల్లో ధ్రువపత్రాల పరిశీలన భౌతికంగా జరుగుతుందని తెలిపారు. మంగళవారం నుంచి ఈనెల ఆరో తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో చేరాలని కోరారు. ఈనెల తొమ్మిది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

ఎంబీఏ కన్వీనర్ కోటాలో 23,989 సీట్లు

- ఎంసీఏలో 4,583 సీట్లు
- నేటినుంచి ధ్రువపత్రాల పరిశీలన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన ఐసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా మంగళవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఐసెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంబీఏలో 33,629 సీట్లున్నాయని తెలిపారు. అందులో కన్వీనర్ కోటాలో 23,989 సీట్లున్నాయని పేర్కొన్నారు. ఎంసీఏలో 6,162 సీట్లుంటే, కన్వీనర్ కోటాలో 4,583 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. సోమవారం నాటికి 10,634 మంది అభ్యర్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించారని తెలిపారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈనెల ఎనిమిదో తేదీ వరకు ఉందని పేర్కొన్నారు. మంగళవారం నుంచి ఈనెల తొమ్మిదో తేదీ వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. నాలుగు నుంచి 11 వరకు వెబ్‌ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tgicet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

రేపటినుంచి పీజీఈసెట్ వెబ్‌ఆప్షన్ల నమోదు

- సవరణ షెడ్యూల్ విడుదల

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఎంఈ/ఎంటెక్‌తోపాటు ఎంఫార్మసీ, ఎంఆర్క్, ఫార్మా-డీ(పీబీ) కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన పీజీఈసెట్ కౌన్సెలింగ్‌లో బుధవారం నుంచి వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు పీజీఈసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు సవరణ షెడ్యూల్‌ను సోమవారం విడుదల చేశారు. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల (ఎన్‌సీసీ, సీఏపీ, వికలాంగులు, స్పోర్ట్స్)కు మంగళవారం వరకు ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని తెలిపారు. బుధ, గురువారాల్లో వెబ్‌ఆప్షన్ల నమోదు ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఆరున ఆప్షన్ల సవరణకు అవకాశముందని పేర్కొన్నారు. ఈనెల తొమ్మిదిన సీట్లు కేటాయిస్తామనీ, ఆ వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరుస్తామని తెలిపారు. అదేనెల పది నుంచి 13వ తేదీ వరకు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయాలని సూచించారు. ఈనెల పది నుంచి తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

మరో 11 జిల్లాలకు భారీ వర్ష సూచన

- ముందస్తు చర్యలపై కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



రాష్ట్రంలోని మరో 11 జిల్లాల్లో భారీ వర్షాలుంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అన్నారు. రాబోయే 24 గంటల్లో ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కొమరం భీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్ధిపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించినట్టు తెలిపారు. ఈ మేరకు సోమవారంనాడామె ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి, వరదల పరిస్థితి, పునరావాస, సహాయక చర్యలను సమీక్షించారు. డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశమున్న జిల్లాల కలెక్టర్లు ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని ఆస్తి, ప్రాణ నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఇప్పటికే ఐదు రోజులుగా వర్షాలు కురుస్తున్న ందున, రానున్న భారీ వర్షాల వల్ల పరిస్థితులు మరింత తీవ్రంగా ఉండే అవకాశముందని హెచ్చరించారు. అన్ని శాఖల సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించే విషయంపై కలెక్టర్లే నిర్ణయం తీసుకోవాలని గుర్తుచేశారు. స్వర్ణ, కడెం ప్రాజెక్టుల గేట్లను తెరవడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలను సరక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్మల్ కలెక్టర్‌ను ఆదేశించారు. నిర్మల్‌కు 31 మంది సభ్యులు, నాలుగు బోట్లు ఉన్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందాన్ని పంపుతున్నామని తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ నుంచి ప్రస్తుతం 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. మహారాష్ట్ర పరీవాహక ప్రాంతం నుంచి వచ్చే నీటి పరిమాణాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకొని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కల్వర్టులు, వాగుల వద్ద సంబంధిత లైన్ డిపార్ట్‌మెంట్‌ల అధికారులతో జాయింట్ టీంలు ఏర్పాటు చేసి నిఘా ఉంచాలని సూచించారు. హైదారాబాద్ నుంచి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని కలెక్టర్లను కోరారు. కంట్రోల్‌రూమ్‌లు 24 గంటలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

జమ్మూ అభ్యర్థుల ఎంపికకు కాంగ్రెస్ సీఈసీ భేటీ

శ్రీనగర్: జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక కసరత్తును వేగవంతం చేసింది. అభ్యర్థుల ఖరారు కోసం సోమవారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో కేంద్ర ఎన్నికల కమిటీ భేటీ అయింది. ఇటీవల 9 మంది అభ్యర్థులను కాంగ్రెస్ ప్రకటించగా మిగిలిన స్థానాలపై వడపోతను ముమ్మరం చేసింది. కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన ఎన్నికలపై చర్చించింది.

వరదలపై మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు విచారం

- తెలుగు రాష్ట్రాల సీఎం సహాయ నిధికి రూ.5 లక్షల చొప్పున విరాళం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, వరద కష్టాలపై భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు విచారం వ్యక్తం చేశారు. ఆయన వ్యక్తిగత పెన్షన్ నుంచి రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సహాయ నిధికి రూ.ఐదు లక్షల చొప్పున సహాయం ప్రకటించారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కుండపోత వర్షాలు, ఉధృతమైన వరదలతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వాటిల్లుతున్న నష్టం తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఫోన్ చేసి తెలుగు రాష్ట్రాల్లో ప్రస్తుత పరిస్థితిని వివరించి, వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశానని పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ఇప్పటికే మాట్లాడాననీ, అక్కడి ప్రభుత్వాల యంత్రాంగాలతో, కేంద్ర అధికారులు పర్యవేక్షిస్తున్నారంటూ ప్రధానమంత్రి వివరించారని తెలిపారు. రెండు రాష్ట్రాలకు తగిన సహాయ సహకారాలు అందజేస్తామంటూ ప్రధాని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయినా తనవంతు సహకారంగా వ్యక్తిగత పెన్షన్ నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.ఐదు లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.ఐదు లక్షలు సహాయ చర్యల నిమిత్తం పంపించానని వివరించారు. ఈ కష్టకాలంలో ఇబ్బందుల్లో ఉన్న వారిని ఆదుకోవడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. యువత కూడా పెద్దఎత్తున ముందుకొచ్చి సహాయక చర్యల్లో పాల్గొవాలని సూచించారు.

తమ కుమారుడు ముప్పవరపు హర్షవర్ధన్ నిర్వహిస్తున్న ముప్పవరపు ఫౌండేషన్ తరపున ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు అందజేశారని వివరించారు. తమ కుమార్తె దీపా వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్వర్ణ భారత్ ట్రస్ట్ నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు, తెలంగాణ ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.2.5 లక్షలు అందజేశారని తెలిపారు.

విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచండి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ రాష్ట్ర దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్పీడీసీఎల్) సీఎమ్‌డీ ముషారఫ్ ఫరూఖీ అధికారుల్ని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సరఫరా స్థితిగతులపై ఆయన సోమవారం ఆయా సర్కిళ్ల చీఫ్ ఇంజినీర్లు, సూపరిటెండింగ్ ఇంజినీర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈదురు గాలులకు భారీ వృక్షాలు, హోర్డింగులు, ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడటంతో పెద్ద సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని అధికారులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కూలిన భారీ చెట్లను, వాటి కొమ్మలను తొలగించి, కొత్త పోల్స్, లైన్‌లు ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బంది కృషిని సీఎమ్‌డీ ప్రసంసించారు. వర్షాన్ని, వరదలను లెక్కచేయకుండా సాహసోపేతంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు చేస్తున్నారని అభినందించారు. సూర్యాపేట జిల్లాలో వర్ష ప్రభావం వల్ల విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం జరిగిందనీ, దాదాపు 1200కు పైగా విద్యుత్ స్తంభాలు, నాలుగు సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయన్నాయని చెప్పారు. ప్రస్తుతం సంస్థ పరిధిలో ఇప్పటివరకు 2,417 విద్యుత్ స్తంభాలు, 21 ట్రాన్స్‌ఫార్మర్లు, 18 సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 412 విద్యుత్ స్తంభాలు, 13 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయనీ, ఈ నష్టం పెరిగే అవకాశమున్నదని తెలిపారు. రాష్ట్రంలో ఇంకా భారీ వర్షం ముప్పు తొలగనందున అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్‌లోనే ఉండాలనీ, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. పునరుద్ధరణ పనులు చేసేటప్పుడు సిబ్బంది తప్పనిసరిగా స్వీయ జాగ్రత్తలు పాటించాలన్నారు. క్షేత్ర స్థాయిలో తగినంత మెన్ అండ్ మెటీరియల్ అందుబాటులో ఉందని తెలిపారు. ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహించినట్టు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ పునరుద్ధరణ పనులు పర్యవేక్షించాలని ఆదేశించారు.

వరద బాధితులను ఆదుకోవడంలో సీఎం రేవంత్‌రెడ్డి విఫలం

- బీఆర్ఎస్‌పై బురద చల్లడం సిగ్గుచేటు
- వరద బాధితులను ఆదుకుంటాం : మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావు



నవతెలంగాణ-చేగుంట

వరద బాధితులను ఆదుకోవడంలో సీఎం రేవంత్ రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. మెదక్ జిల్లా చేగుంట మండలం ఐబీ గెస్ట్ హౌస్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి వరద బాధితులకు సహాయం చేయకుండా తమపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా తమపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఫెయిల్ అయ్యారన్నారు. ఖమ్మం వరద సహాయక బాధితులను ఆదుకోక వారిపై లాఠీచార్జి చేయించడం సిగ్గుచేటన్నారు. 74 ఏండ్లు ఉన్న ఏపీ సీఎం బయట తిరుగుతుంటే, 54 ఏండ్లు ఉన్న మన సీఎం ఇంట్లో ఉన్నాడని విమర్శించారు. వాతావరణ శాఖ హెచ్చరించినా ముందస్తు చర్యలు చేపట్టలేదన్నారు. హెలికాప్టర్‌ను ఏర్పాటు చేసి ఉంటే వరదల్లో చిక్కుకున్న బాధితుల చాలా మంది ప్రాణాలు దక్కేవన్నారు. 16 మంది చనిపోయారని ప్రభుత్వం చెప్తుంది కానీ తమకున్న సమాచారం మేరకు ఇప్పటివరకు 31 మంది చనిపోయారని తెలుస్తుందన్నారు. తమ కార్యకర్తలు సహాయక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. ఖమ్మంలో తొమ్మిది సీట్లు ఇస్తే, తొమ్మిది మందిని కూడా కాపాడలేకపోయారన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, వెంటనే సహాయక చర్యలు చేపట్టాలన్నారు. మీరు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చనిపోయిన వ్యక్తులకు రూ.25 లక్షలు అడిగిన మీరు ఇప్పుడు చనిపోయిన వ్యక్తులకు రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం 2023 జులైలో మొరంచ వాగు ప్రవాహంలో ఆరుగురిని హెలికాప్టర్ ద్వారా కాపాడిన విషయాన్ని గుర్తుచేశారు.

వరదల్లో చిక్కుకున్న వారికి తాగునీరు, ఆహార పదార్థాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. త్వరలోనే వరద బాధితులను ఆదుకుంటామని, విరాళాలు సేకరించి బాధితులకు నిత్యావసర సరుకులతో పాటు చదువుకుంటున్న పిల్లలకు పుస్తకాలు, బట్టలు తదితర వస్తువులను అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు కోమండ్ల నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుంగలు పడిన చెరువులకు, రోడ్లకు మరమ్మతులు చేయించాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవ తెలంగాణ-హవేలీ ఘనాపూర్

బుంగలు పడిన చెరువులకు, తెగిపోయిన రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేసి ప్రజలకు ఉపశమనం కలిగించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ మండల పరిధిలోని ముత్తయి కోట, లింగసాన్ పల్లి గ్రామాల్లో వర్షంతో కొట్టుకుపోయిన రోడ్లు, తెగిపోయిన చెరువులు, చెరువుకు పడిన బుంగలను సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాండాలకు వెళ్లే రహదారులు భారీ వర్షానికి కొట్టుకుపోవడం వల్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, వాటిని పునరుద్ధరించాలని సూచించారు. చెరువుకు పడిన బుంగలను కూడా తాత్కాలిక మరమ్మత్తులు చేసి ప్రజలకు ఉపశమనం కల్పించాలని ఆదేశించారు. పరిశీలించిన వారిలో.. హవేలీ ఘనపూర్, మెదక్ తహసీల్దార్‌లు నవీన్, లక్ష్మణ్ బాబు, ఇరిగేషన్ ఏఈ శ్రీహరి గౌడ్, మండల సర్వేయర్ రమేష్ గౌడ్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

అండగా ఉంటాం

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడి నుంచి ఆదేశిస్తుమన్నారు.

స్వయంగా వరద బాధితులతో మాట్లాడిన ముఖ్యమంత్రి..

మున్నేరు పరివాహక ప్రాంతంలో విపరీతమైన బురద ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బురదను సైతం లెక్క చేయకుండా స్వయంగా వరద బాధితులతో వారి ఇళ్లలోకి వెళ్ళి పలకరించి మాట్లాడారు.పోలేపల్లి గ్రామపంచాయతీలోని కరుణగిరి రాజీవ్ గహాల వద్ద నివాసం ఉంటున్న మూతి రాజేశ్వరి ఇంట్లోకి వెళ్ళి ఇల్లంతా కలియదిరుగుతూ పరిశీలించారు.జరిగిన నష్టానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆమెకు ధైర్యం కల్పించారు.అదే కాలనీలో నివాసముంటున్న భయ్యా సంధ్య ఇంట్లోకి భారీ వరద చేరడంతో ఇల్లంతా ఒండ్రు మట్టితో నిండి ఉన్నప్పటికీ తన

వాహనం దిగి ఆమె ఇంటికి వెళ్ళి వారి కుటంబాన్ని పరామర్శించి వారికి అండగా ఉంటామని భరోసా కల్పించారు.

సీఎంకు నిరసన సెగ...

రాజీవ్ గృహ కల్పలో పర్యటిస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి అక్కడ వరద బాధితులు రోడ్డుపై బైఠాయించి సీఎం డాం, డాం అంటూ నిరసన తెలిపారు. దీంతో స్వయంగా ముఖ్యమంత్రి వారి వద్దకు వెళ్లి మాట్లాడారు. అక్కడ ప్రజలనుద్దేశించి మాట్లాడిన అనంతరం ఖమ్మం నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, సారథినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి వరద బాధితులను పరామర్శించి ఖమ్మం నగరంలోని ఐడీఓసీ కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు వెళ్ళారు. ముఖ్యమంత్రి పర్యటనలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, మున్సిపల్, విపత్తుల డైరెక్టర్ వి.పి. గౌతమ్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఇరిగేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ్‌బాబు తదితరులున్నారు.

మరో రెండు రోజులు వర్షాలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- వెల్లడించిన వాతావరణ శాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో రాగల రెండు రోజుల పాటు తేలిక నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. దక్షిణ ఒడిశా,దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఏపీ వద్ద కేంద్రీకృత మైన వాయుగుండం విదర్భ, తెలంగాణలో విస్తరించిందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్ర వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఈ మేరకు పలు జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసీఫాబాద్, భూపాలపల్లి, నిర్మల్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, యాదాద్రి జిల్లాల్లో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశముందని వివరించింది. హైదరాబాద్ నగరంలో రాగల 48 గంటల పాటు ఉరుములు, మెరుపులతో కూడి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

భారీ వర్షాలకు 754 రోడ్లు ధ్వంసం

శాశ్వత మరమ్మతులకు రూ.673.29 కోట్లు అవసరం

- సహాయక చర్యలతోపాటు నష్టం అంచనా
- ఇంజినీరింగ్ అధికారులకు సర్కారు ఆదేశం
- ప్రత్యేకంగా అర్అండ్‌బీలో కంట్రోల్ రూమ్



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రవ్యాప్తంగా గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పంచాయతీరాజ్, రోడ్లు, భవనాల శాఖకు చెందిన రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈమేరకు ఇరు శాఖల ఉన్నతాధికారులు సహాయక చర్యలు చేపడుతూనే నష్టాలను అంచనా వేయాలని సర్కారు ఆదేశించింది. ఈమేరకు ఉన్నతాధికారులు కింది స్థాయి ఇంజినీర్లకు ఆదేశించారు. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలంటూ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 754 రోడ్లు దెబ్బతినగా, వాటి శాశ్వత ప్రాతిపదికన పునరుద్ధరించడానికి రూ.673.29 కోట్లు అవసరమని అంచనాకు వచ్చారు. హైదరాబాద్‌లోని ఎర్రమంజిల్‌లో ఆర్అండ్‌బీ రాష్ట్ర కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. అన్ని జిల్లాల్లో రికార్డు స్థాయిలో వర్షాలు కురవడంతో చాలా ప్రాంతాల్లో రోడ్లు కొట్టుకుపోయాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పంచాయతీరాజ్ రోడ్లు ఏ మేరకు ధ్వంసం కావడం, దెబ్బతినడం తదితర అంశాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని చెప్పారు. చాలా జిల్లాల్లో పెద్ద ఎత్తున వరద పోటెత్తడంతో చెరువుల కట్టలు తెగిపోయాయి. ఈ వానల కారణంగా ఏపీ-తెలంగాణ మధ్య రాకపోకలకు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. ఏకంగా రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయిన విషయం విదితమే. తెలంగాణ -ఏపీ సరిహద్దు రామాపురం వద్ద చిమిర్యాల వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. కోదాడ నుంచి వరదనీరు దిగువకు భారీగా వస్తున్నది. దీంతోపాటు నల్లబండగూడెం వద్ద జాతీయ రహదారిపైకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఈనేపథ్యంలో రెండు రాష్ట్రాలకు మధ్య రాకపోకలు స్థంభించాయి. రోడ్లపై నిలిచిన నీటిని మళ్లించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నది. అయినా సరే ఎగువ నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరడంతో రహదారులపై నీటిని తొలగించడం కష్టంగా మారిందని అర్అండ్‌బీ అధికారులు అంటున్నారు. ఎక్కడికక్కడ వాగులు పొంగడంతో పాటుగా కాలువలు కట్టలు తెగి ప్రవహిస్తున్నాయి. దీంతో రహదారులన్ని నీటమునిగాయి. మరోవైపు రెండు రాష్ట్రాల్లోనూ భారీగా వర్షాలు పడడంతో ఇండ్లలోకి నీరు చేరింది. ఆదిలాబాద్ జిల్లా పెనుగంగా ఉప్పొంగి నది ప్రవహిస్తున్నది. ఆనంద్‌పూర్ వద్ద బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న పెనుగంగా కారణంగా... తెలంగాణ, మహారాష్ట్ర మధ్య రాకపోకలకు బ్రేక్ పడింది. ఇక ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలంలో కుండపోత వర్షం కురుస్తున్నది. విజయవాడ, ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారిపై వరద నీరు పోటెత్తింది. బయ్యన్నగూడెం, తుమ్మలపల్లి, కుప్పెనకుంట్ల గ్రామాల వద్ద జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా విజయవాడ, భద్రాచలం వైపు రాకపోకలు నిలిచిపోయాయి.

మహబూబ్‌నగర్ - చించోలి జాతీయ ప్రధాన రహదారి హన్వాడ మండలం ఇబ్రహీంబాద్ వద్ద కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు కొట్టుకుపోయింది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు సగానికిపైగా జిల్లాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. రోడ్లు నష్టాన్ని అంచనా వేసేందుకు ఆర్అండ్‌బీ శాఖ ప్రత్యేకంగా కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. సహాయక చర్యలూ తీసుకుంటున్నారు. ఇదిలావుండగా 119 పంచాయతీరాజ్ రోడ్లు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఎక్కువగా ఖమ్మం-భద్రాద్రి ములుగు-నల్లగొండ రోడ్లు ధ్వంసమైనట్టు పంచాయరాజ్ ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. సూర్యాపేట జిల్లాలో దాదాపు 11 రోడ్లు కొట్టుకుపోయాయి. వాటిని మరమ్మతు చేయడానికి రూ.23 కోట్లు అవసరమవుతాయని అధికారులు అంచనాకు వచ్చారు. మిగతా రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అంటున్నారు. వాగులు, వంకలు, పొంగిపోర్లడంతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. హన్మకొండ, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, యాదాద్రి-భువనగిరి, వికారాబాద్, సిద్ధిపేట, కామారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ తదితర జిల్లాలో రోడ్లు దెబ్బతిన్నాయి.

నష్టం ఇలా...

68 రోడ్లు కొట్టుకుపోయాయి
300 రోడ్లు ఉప్పొంగి దెబ్బతిన్నాయి
386 రోడ్ల ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారాయి
తాత్కాలిక మరమ్మతుల కోసం రూ.5.67 కోట్లు అవసరం
శాశ్వత మరమ్మతుల కోసం రూ.673.29 కోట్లు కావాలి.

విద్యార్థుల కొట్లాట..

- హాకీ స్టిక్, క్రికెట్ బ్యాట్, చెప్పులతో జూనియర్‌లను కొట్టిన సీనియర్లు
- 2 నెలల్లోపే 2 సార్లు కొట్టుకున్న విద్యార్థులు
- తరచూ గొడవలకు ప్రిన్సిపల్ పర్యవేక్షణ లోపమే కారణమా?
- ప్రిన్సిపల్‌పై విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం



నవతెలంగాణ-తూప్రాన్

మెదక్ జిల్లా తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద ఉన్న తెలంగాణ రెసిడెన్షియల్ బాలుర పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులను 10వ తరగతి విద్యార్థులు ఆదివారం రాత్రి విచక్షణారహితంగా కొట్టారు. టీఎస్ఆర్జేసీ పాఠశాలలో బుద్ధిగా చదువుకోవాల్సిన విద్యార్థులు గొడవలకు ఉపక్రమిస్తున్నారు. 2 నెలల క్రితం ఇంటర్ విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులను చితక్కొట్టిన విషయాన్ని మరవకముందే మరొక దారుణం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ముగ్గురు విద్యార్థులను ఆదివారం రాత్రి 10 నుంచి 12 గంటల సమయంలో సెంట్ బాటిల్ విషయంలో వారి మధ్య జరిగిన వాగ్వాదంతో ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. అనంతరం పాత గొడవలను సైతం దృష్టిలో ఉంచుకొని 10 మంది 10 వ తరగతి విద్యార్థులు హాకీ స్టిక్, క్రికెట్ బ్యాట్లు, చెప్పులు, కట్టెలతో విచక్షణారహితంగా 9వ తరగతి విద్యార్థులను కొట్టారు. విద్యార్థులు ఎంత ప్రాధేయపడ్డా వదలకపోగా.. వారి బట్టలను నోట్లో కుక్కి, కొట్టేటప్పుడు అరిచినా, ఉపాధ్యాయులకు చెప్పిన మిమ్మల్ని చంపేస్తామని 10వ తరగతి విద్యార్థులు బెదిరించారు.

ప్రిన్సిపాల్‌ను నిలదీసిన విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యార్థులు కొట్టుకున్న విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చి ప్రిన్సిపాల్ మురళితో వాగ్వాదానికి దిగారు. పాఠశాలలో ప్రిన్సిపాల్ పర్యవేక్షణా లోపం ఉందని, విద్యార్థులు కొట్టుకు నేటప్పుడు ఉపాధ్యాయులు ఏమి చేస్తున్నారని తల్లిదండ్రులు ప్రశ్నించారు. 9వ తరగతి విద్యార్థులు వీపులపై ఏర్పడిన తీవ్రమైన గాయాలను చూయిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ మురళి మాట్లాడుతూ.. 9వ తరగతి విద్యార్థులను కొట్టిన 10 వ తరగతి విద్యార్థులకు టీసీలు ఇచ్చి పాఠశాల నుంచి బయటకు పంపిస్తామన్నారు. ఇంత పెద్ద గొడవ జరిగినా ఎవరికీ తెలియకుండా పాఠశాల ప్రిన్సిపాల్ ఉపాధ్యాయులు గోప్యంగా ఉంచ డానికి కారణమేంటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. ఇకపై ఇలాంటి గొడవలు పాఠశాలలో పునరావతం కాకుండా చర్యలు చేపట్టాలని విద్యాశాఖ ఉన్నతాధి,కారులను విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకున్నారు.

ప్రాజెక్టులకు పెరిగిన వరద ప్రవాహం

- కొనసాగుతున్న విద్యుదుత్పత్తి



నవతెలంగాణ- విలేకరులు

రాష్ట్రంలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షంతో పాటు ఎగువన కురుస్తున్న వర్షానికి ప్రాజెక్టులకు వరద ప్రవాహం పెరిగింది. దాంతో ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు 45 గేట్లు ఎత్తి 3,07,845 క్యూసెక్కుల నీరు శ్రీశైలం జలాశయం లోనికి వదులుతున్నట్టు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు 10 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నట్టు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 3,24,525 క్యూసెక్కులు ఉండగా, ఔట్ ఫ్లో 3,49,152 క్యూసెక్కులుగా ఉందన్నారు. నీటిమట్టం 885 అడుగులకు చేరింది. కాగా కుడి, ఎడుమ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోందని తెలిపారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ఎగువనున్న కడెం నుంచి 40వేల క్యూసెక్కులు వస్తుండగా.. ప్రాజెక్టు క్యాచ్‌మెంట్ ఏరియా నుంచే పెద్దఎత్తున వరద వస్తోంది. ప్రాజెక్టు 20.175టీఎంసీ సామర్థ్యం ఉండగా.. 15టీఎంసీల వరకు నీటి నిల్వ ఉండేట్టు చూస్తూ ప్రాజెక్టు 38గేట్లు ఎత్తి దిగువకు 2.60లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరికిలోకి వదులుతున్నారు.నల్లగొండ జిల్లా కేతెపల్లిలోని మూసి ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. 7 క్రస్ట్ గేట్లను నాలుగు అడుగుల మేర ఎత్తి దిగువ మూసీలోకి 12410 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 641.90 అడుగుల వద్ద స్థిరంగా ఉంది. దుందుభి నదిలో నీరు ఉధృతంగా ప్రవహించడంతో డిండీ ప్రాజెక్టు ఆదివారం రాత్రి నుంచి పొంగిపొర్లుతోంది. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ శ్రీశైలం హైవేపై ఉండటం వల్ల పర్యాటకుల సందడి పెరిగింది. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్ట్‌లో నాలుగు రోజుల కిందటి వరకు కేవలం 14 టీఎంసీల నీరు మాత్రమే ఉండగా ప్రస్తుతం 19 టీఎంసీలకు చేరింది. కాగా ప్రాజెక్ట్ పూర్తి సామర్థ్యం 29 టీఎంసీలు.ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో 22,036 క్యూసెక్కులు ఉండగా.. అవుట్ ఫ్లో 401 క్యూసెక్కుల నీరు బయటికి వెళుతున్నది. కాగా, సింగూరు ప్రాజెక్ట్‌ను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరుతో కలిసి సోమవారం ప్రాజెక్ట్‌ను సందర్శించారు.



కడెం ప్రాజెక్టుకు ప్రస్తుతం 60వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 18గేట్లు ఎత్తివేసి 75వేల క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. ఎగువన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 40గేట్లు ఎత్తి నీరు వదులుతుండటంతో గోదావరి నది పొంగి ప్రవహిస్తోంది. దీంతో సదర్మాట్ బ్యారేజీలోకి భారీ స్థాయిలో వరద చేరింది. 36 గేట్లు ఎత్తి బ్యారేజీ నీటిని దిగువకు వదిలారు. ఆసిఫాబాద్ జిల్లాలోని అడ, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని దిగువకు వదిలేయడంతో గుండివాగు మరింత ఉధృతంగా ప్రవహిస్తోంది. వంతెనపై నుంచి నీరు పారడంతో సుమారు 10 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోస్రా-మలన్‌గొంది వద్ద బ్రిడ్జి తెగిపోయింది. స్వర్ణ ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని కిందకు వదిలేయడంతో సిద్దాపూర్ వాగు మరింత వంతెనపై నుంచి ప్రవహిస్తోంది. దాంతో నిర్మల్- కౌట్ల(కె) గ్రామాలకు రాకపోకలు నిలిపివేశారు. మత్తడివాగు, సాత్నాల తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తారు. పరివా హక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. మంచిర్యాల జిల్లాలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు 32 గేట్లు ఎత్తి వేయడంతో స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, కలెక్టర్ కుమార్ దీపక్, డీసీపీ భాస్కర్ ప్రాజెక్టును సందర్శించారు.

ఎస్సారెస్పీ గేట్లు ఎత్తివేత

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు మంజీరా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో ఎస్సారెస్పీకి వరదనీరు పోటెత్తుతుంది. ఆదివారం అర్ధరాత్రి నుంచి గంట గంటకూ ప్రవాహం పెరుగుతూ వచ్చింది. దాంతో మొత్తం 41 గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2.5 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా.. 3.14 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తి కోసం ఎస్కేప్ గేట్ల ద్వారా 4000 క్యూసెక్కుల నీరు గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091.00 అడుగులు, 80.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1088.9 అడుగులు 72.990 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు అధికారులు తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 51 వేల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 17.8 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 9.52 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

నాడు లేని ప్రేమ నేడెందుకో?

- సంధ్యారెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాలమాకుల పాఠశాల విద్యార్థులకు భోజనం సరిగ్గా పెట్టలేదంటూ విద్యార్థులను విద్యాశాఖ మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కౌగిలించు కున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి సంధ్యారెడ్డి తెలిపారు.

అయితే గతంలో బాసర ఐఐఐటీ విద్యార్థులకు భోజనం సరిగ్గా పెట్టటం లేదని ధర్నా చేస్తే సబితా ఇంద్రారెడ్డి ప్రేమ ఎక్కడికి పోయిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు.

సింగూరు ఎడమ కాలువకు గండి

- పంటపొలాల్లోకి భారీగా వరద నీరు
- లబోదిబోమంటున్న రైతులు



నవతెలంగాణ-పుల్కల్

గత నాలుగు రోజులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో సింగూరు ఎడమ కాలువ వరద నీటితో నిండి.. దానికి అనుసంధానంగా ఉన్న పిల్ల కాలువల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరుతున్నది. ఈ క్రమంలో సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని ఇసోజిపేట గ్రామ శివారులో ఆ కాల్వకు గండిపడింది. దాంతో నీటితోపాటు పెద్దఎత్తున మట్టి కూడా వ్యవసాయ పొల్లాల్లోకి కొట్టుకుపోయింది. ఒక్కసారిగా కట్ట పగిలిపోవడంతో నీరంతా పొలాల్లోకి చేరిందని.. పంటలు పూర్తిగా దెబ్బతినే దుస్థితి వచ్చిందని బాధిత రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఇప్పటికి ఏ ఒక్క అధికారి స్పందించలేదని వాపోయారు. గతేడాది కూడా ఇదే కాలువకు గండి పడగా.. అప్పటి ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వెంటడే స్పందించి నేరుగా ఆయన ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీల సాయంతో గండిని పూడ్చి వేయించారన్నారు. ఇప్పుడు కూడా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి గండిని పూడ్చాలని రైతులు కోరుతున్నారు.

సాగు భూములను వదులుకోం..

- సర్వేకోసం వచ్చిన అదనపు కలెక్టర్, ఆర్డీఓను అడ్డుకున్న రైతులు
- భూ సేకరణకు వ్యతిరేకంగా రోడ్డుపై గంటలపాటు బైఠాయింపు



నవతెలంగాణ-న్యాల్‌కల్

సారవంతమైన సాగు భూములను ఫార్మా కంపెనీల పేరిట లాక్కోవద్దని.. ఎట్టి పరిస్థితుల్లో ఆ భూములను వదులుకోబోమని బాధిత రైతులు అధికారులకు స్పష్టం చేశారు. అదనపు కలెక్టర్ మాధురి, ఆర్డీఓ రాజు, తహసీల్దార్ భూపాల్, ఉప తహసీల్దార్ రాజిరెడ్డితో కలిసి ఫార్మాసిటీ ఏర్పాటుకు భూ సేకరణ కోసం సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూరు గ్రామంలో భూములను పరిశీలిస్తుండగా రైతులు అడ్డుకున్నారు. పచ్చని పల్లెల్లోకి కాలుష్య కంపెనీలు తేవొద్దని నినాదాలు చేస్తూ.. మళ్లి గ్రామస్తులతో కలిసి గంటలపాటు రోడ్డుపై బైఠాయించారు. సాగు భూములను కంపెనీలకు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి, సీఐ హనుమంతు, శివలింగం, డివిజన్ ఎస్ఐతో ఘటనా స్థలానికి చేరుకుని రైతులకు నచ్చజెప్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫార్మాసిటీ భూ సేకరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని అదనపు కలెక్టర్, అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. ఎట్టి పరిస్థితుల్లో భూములు వదులుకోమని తేల్చిచెప్పారు. ఈ నిరసనలో ఆయా గ్రామాల భూ నిర్వాసితులు డప్పూర్ శివరాజ్, రవికుమార్, రవి గౌడ్, కిరణ్ గౌడ్, అరుణ్, మారుతి యాదవ్ తదితరులున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- టీజీఈజేఏసీ



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సీపీఎస్, యూపీఎస్ మాకేందుకు? పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తే చాలని టీజీఈజేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్‌రావు, జేఏసీ నేతలు చావ రవి, తదితరులు డిమాండ్ చేశారు. పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా హైదరాబాద్‌లోని గన్ పార్క్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. దేశవ్యాప్తంగా కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఇటీవల యూనిఫైడ్ పెన్షన్ విధానాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. దీన్ని ఉద్యోగులు అంగీకరించనప్పటికీ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2004కు ముందున్న పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆ విధానంలో ఉద్యోగి రిటైర్ అయినప్పుడు ఉన్న చివరి వేతనం (బేసిక్,డీఏ)లోని 50శాతం పెన్షన్ రూపంలో ఉద్యోగికి చెల్లించే వారని గుర్తు చేశారు.పెరుగుతున్న సగటు ఆయుప్రమాణం,పెరుగుతున్న ఉద్యోగుల సంఖ్యవేతనాల భారాన్ని తగ్గించుకునేందుకు పెన్షనర్లకు అన్యాయం చేస్తే ఎలా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమం కోసం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయలనీ, ఉద్యోగుల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీలో భాగస్వాములుగా ఉన్న 205 సంఘాల నేతలు పాల్గొన్నారు.

స్థానిక పోలీస్ స్టేషన్లతో ఆస్పత్రుల సీసీ కెమెరాల అనుసంధానం

- మంత్రి దామోదర రాజనర్సింహ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో అన్ని స్థాయిల్లో ఆస్పత్రుల్లో సీసీ కెమెరాలను స్థానిక పోలీస్ స్టేషన్లతో అనుసంధానించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన ఆస్పత్రుల్లో భద్రతపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా డాక్టర్లు, మహిళా నర్సింగ్ ఆఫీసర్లు తదితర సిబ్బందికి రక్షణగా రాత్రి సమయాల్లో షీ టీంలతో పెట్రోలింగ్ చేసేలా నిబంధనలు రూపొందించాలని సూచించారు. అన్ని బోధనాస్పత్రుల్లో అవుట్ పోస్టులు శాశ్వత ప్రాతిపదికన నిర్మించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. టిమ్స్ ఆస్పత్రుల్లో ఇప్పటికే పోలీస్ అవుట్ పోస్టుల కోసం స్థలం కేటాయించగా, 10 బోధనాస్పత్రుల్లో అవుట్ పోస్టులను నిర్మించినట్టు తెలిపారు. ప్రయివేటు సెక్యూరిటీ ఏజెన్సీలు తప్పనిసరిగా పీఎస్ఏఆర్ (ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ - రెగ్యులేషన్స్) యాక్ట్-2015 ప్రకారం గుర్తింపు పొంది ఉండాలని మంత్రి ఆదేశించారు. భద్రతపై స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ) రూపొందించాలని మంత్రి సూచించారు.ఆస్పత్రులలో మహిళ డాక్టర్లు, నర్సింగ్ స్టాఫ్, సిబ్బంది భద్రతపై సుప్రీంకోర్టు ఇచ్చిన నిబంధనల మేరకు రాష్ట్ర, జిల్లా స్థాయిలలో హాస్పిటల్స్ సేఫ్టీ కమిటీ భద్రతాపరమైన నియమాలను రూపొందించి ఈ నెల 14వ తేదీలోపు రిపోర్టు సమర్పించాలని కోరారు.వైద్యులు, నర్సుల భద్రతలో భాగంగా నమోదైన కేసులను యాక్ట్ 11 ఆఫ్ 2008 ప్రకారం రిజిస్టర్ చేయాలని ఈ సమీక్షలో నిర్ణయించారు. ప్రతి ఆస్పత్రిలో సెక్యూరిటీ హౌజ్ ను ఏర్పాటు చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రాష్ట్ర హోం శాఖ ముఖ్య కార్యదర్శి రవి గుప్త, తెలంగాణ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ అదనపు డైరెక్టర్ జనరల్ అనిల్ కుమార్, రాష్ట్ర ప్రజారోగ్యం , కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, రాష్ట్ర న్యాయ శాఖ కార్యదర్శి రెండ్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



కులగణనపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి డిమాండ్
- గాంధీఆస్పత్రిలో సంజయ్‌కుమార్, బత్తు సిద్ధేశ్వర్‌కు పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కులగణనపైనా, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుపైనా అఖిపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ ఆజాది యూత్ ఫెడరేషన్ అధ్యక్షులు జక్కని సంజయ్ కుమార్, బీసీ మహాసభ అధ్యక్షులు బత్తుల సిద్ధేశ్వర్ తదితరులను సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నరసింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, పి ఆశయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా డిజి నరసింహారావు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లపై దీక్ష చేస్తున్న వారిని ప్రభుత్వం అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్న వారికి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా కులగణన చేపట్టాలనీ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కులగణనపై నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలనీ, అప్పుడే దీనికి చట్టబద్ధత వస్తుందని అన్నారు. 50 శాతం రిజర్వేషన్ మించరాదన్న సుప్రీం కోర్టు తీర్పునకు అడ్డు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విపత్తు సమయంలో ప్రజలకు అండగా ఉందాం

- పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేద్దాం
- సహాయ కార్యక్రమాల్లో పాల్గొందాం

ప్రభుత్వ ఆదేశాలను పాటిద్దాం : తెలంగాణ ఉద్యోగ జేఏసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వరద సహాయ, పునరావాస కార్యక్రమాల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, అధికారులకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ అభినందనలు తెలిపింది. ప్రకృతి విపత్తులు సంభవించిన ప్రస్తుత సమయంలో ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలను పాటించాలనీ, పనిగంటలతో సంబంధం లేకుండా నిర్విరామంగా పనిచేయాలని కోరింది. సహాయ కార్యక్రమాల్లో పాల్గొనాలనీ, ప్రజలను కాపాడుకోవాలనీ, సంపదను పరిరక్షించుకోవాలని సూచించింది. ఈ మేరకు తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్, టీఎన్జీవో అధ్యక్షులు మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్, టీజీవో అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కొన్ని రోజులుగా రాష్ట్రంలో కురుస్తున్న వర్ష బీభత్సానికి రాష్ట్రంలో మారుమూల ప్రాంతాల నుంచి పట్టణాల వరకు జనజీవనం స్థంభించిపోయిందని తెలిపారు. ప్రజలు ధన, ప్రాణ, పశు పక్షాదులు, వ్యవసాయ పంటలు, సంపదలకు తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగమైన ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ప్రజలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. వరద సహాయ కార్యక్రమాల్లో నిర్విరామంగా పాల్గొనాలని కోరారు. ఇలాంటి క్లిష్ట సమయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రజలకు ప్రాణనష్టం రాకుండా సహాయం చేయడానికి పనిగంటలతో సంబంధం లేకుండా పనిచేయాలని సూచించారు. ఉద్యోగులు, అధికారులు ఉన్నారంటూ మరింత నిబద్ధతతో పనిచేసి ప్రజల్లో భరోసా కల్పించాలని తెలిపారు.

సర్పంచులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలి

- మాజీమంత్రి వి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ అధికారంలోకొచ్చి తొమ్మిది నెలలు కావొస్తున్నదనీ, సర్పంచులకు పెండింగ్ బిల్లులు ఎందుకు చెల్లించలేదని మాజీమంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడుతూ సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు.రూ.1300 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు.

నూతన ఆర్థిక విధానాలతో వ్యవసాయ రంగం దివాలా

- ప్రతి ఉద్యమం రైతాంగ పోరాటాలతోనే ప్రారంభం : తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు
- ముగిసిన రైతు శిక్షణా తరగతులు
- ఎకరానికి రూ.25వేలు నష్టపరిహారం ఇవ్వాలని తీర్మానం



నవతెలంగాణ-రంగారెడ్డి ప్రతినిధి

దేశంలో నూతన ఆర్థిక విధానాలు తెర మీదకు వచ్చిన తర్వాత వ్యవసాయ రంగం క్రమంగా దివాలా తీస్తూ వస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం సైతం వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్ శక్తుల చేతిలో పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. వీటిపై క్షేత్రస్థాయిలో ప్రజా ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం పరిధిలోని రాందాస్‌పల్లి శుభం కన్వెన్షన్ హాల్‌లో మూడు రోజులుగా జరుగుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర శిక్షణా తరగతులు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ.. కార్మిక, కర్షక ఐక్య ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కరించుకోగలుగుతామన్నారు. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశాన్ని విముక్తి చేసుకోవడంలోనూ రైతాంగ ఉద్యమాలు కీలకంగా పని చేశాయన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సైతం రైతుల భాగస్వామ్యంతోనే 10వేల ఎకరాల భూములను ఎర్రజెండా నాయకత్వంలో పంపిణీ చేసిందన్నారు. అందులో భాగంగానే ప్రధాని మోడీ నాయకత్వంలో తీసుకువచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతాంగం బలమైన ఉద్యమాన్ని నిర్వహించి, విజయం సాధించిందన్నారు. చివరికి ఆ నల్ల చట్టాలను వెనక్కి తీసుకోక తప్పలేదని తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్‌ఆర్ చట్టం తీసుకొచ్చిన తర్వాత అనుభవదారు కాలమ్ లేకుండా చేశారని, ఈ కాలాన్ని భూమాత యాప్‌లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతులు నిర్లక్ష్యానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భూ సేకరణ చేస్తే 2013 సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం చేయొద్దని విన్నవించారు.

రెండు తీర్మానాలకు అమోదం

మూడు రోజుల పాటు జరిగిన రాజకీయ శిక్షణా తరగతుల్లో రెండు తీర్మానాలను ప్రతినిధులు ఆమోదించారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి, రైతును ఆదుకోవాలని సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేసింది. వాణిజ్య పంటలకు రూ.50వేల, మెట్ట పంటలకు రూ.50వేల చొప్పున నష్టపరిహారం అందజేయడంతో పాటు మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు, గాయపడిన కుటుంబానికి రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, మృత్యువాత పడిన పశువులకు నష్టపరిహారం అందజేయాలని తీర్మానించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని అర్హులందరికీ ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు సైతం రుణమాఫీ చేసి ఆదుకోవాలని కోరారు. రేషన్ కార్డు ప్రామాణికంగా కాకుండా రుణం పొందిన వారందరికీ రుణాలను మాఫీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రాష్ట్ర నాయకులు పీ.జంగారెడ్డి, మూడ్ శోభన్, బొంతల చంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచందర్, మధుసూదన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మండల అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణారెడ్డి, ముసలయ్య, శ్రీనివాసరెడ్డి, విక్రమ్, ప్రజా సంఘాల నాయకులు, ఉన్నారు.

వలస కార్మికుల బాగుకు ఏం చేశారు?

- వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయండి : కేంద్రాన్ని ఆదేశించిన సుప్రీం



న్యూఢిల్లీ : వలస కార్మికులకు సంక్షేమ చర్యలపై తీసుకున్న చర్యలతో అఫిడవిట్‌ను దాఖలు చేయాలని సుప్రీం కోర్టు సోమవారం కేంద్రాన్ని ఆదేశించింది. 2021లో తాము ఇచ్చిన తీర్పు, తదనంతరం జారీ చేసిన ఆదేశాలకు అనుగుణంగా వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వడం, చేపట్టిన ఇతర సంక్షేమ చర్యల వివరాలను అందచేయాలని ఆదేశించింది. కోవిడ్ సమయంలో తీవ్ర ఇబ్బందుల పాలైన వలస కార్మికులకు రేషన్ కార్డులు ఇవ్వడంతో సహా పలు సంక్షేమ చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశిస్తూ సుప్రీంకోర్టు 2021 జూన్ 29న తీర్పు ఇచ్చింది. తదనంతర కాలంలో కూడా పలు ఆదేశాలు జారీ చేసింది. ఇ-శ్రమ్ పోర్టల్‌లో నమోదైన వలస కార్మికులందరికీ ఇవి వర్తింపజేయాలని కోరింది. జస్టిస్ సి.టి.రవికుమార్, జస్టిస్ సంజయ్ కరోల్‌లతో కూడిన బెంచ్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. ఇ-శ్రమ్ అనేది దేశవ్యాప్తంగా గల అసంఘటిత రంగ కార్మికులకు సమగ్రమైన జాతీయ డేటాబేస్ (ఎన్‌డియుడబ్ల్యు). అసంఘటిత కార్మిక లోకానికి సంక్షేమ ప్రయోజనాలు అందజేయడంతో పాటూ సామాజిక భద్రతా చర్యలను చేపట్టే లక్ష్యంతో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ ఈ డేటాబేస్‌ను ప్రారంభించింది.

కోవిడ్ సమయంలో సుప్రీం కోర్టు సుమోటోగా ఈ కేసును చేపట్టింది. ఇప్పుడు కరోనా కాలం ముగిసినందున ఇక ఆ కేసును మూసివేయవచ్చని న్యాయవాదికి సూచించిన నేపథ్యంలో లాయర్ ప్రశాంత్ భూషణ్, జస్టిస్ కరోల్ మధ్య తీవ్ర మాటల యుద్ధం చోటు చేసుకుంది. "కోవిడ్ ముగిసింది. ఒకవేళ రేషన్ కార్డుల జారీలో ఎవరికైనా ఇబ్బంది వుంటే వారు సంబంధిత హైకోర్టులకు వెళ్లవచ్చు. ఈ ఆదేశాలతో మేం ఈ కేసును మూసివేయాలనుకుంటున్నాం" అని జస్టిస్ కరోల్ పేర్కొన్నారు. దానిపై ప్రశాంత్ భూషణ్ చాలా తీవ్రంగా స్పందించారు. ఈ కార్యకలాపాల పరిధి చాలా విస్తరించి వుంది. ఈ సమయంలో కేసును మూసివేస్తే అది న్యాయ క్రమశిక్షణను ఉల్లంఘించినట్లవుతుంది, మీరు అలా చేయరాదని' చెప్పారు.

ఇరు పక్షాల మధ్య వాడిగా వేడిగా వాదనలు కొనసాగిన అనంతరం ఈ కేసులో గతంలో కోర్టు జారీ చేసిన ఆదేశాలను అమలు చేయరాదని కేంద్రం యోచిస్తోందని భూషణ్ పేర్కొన్నారు. 2021లో జనగణన జరిగింది. దానికి అనుగుణంగా జనాభా సర్వే చేపట్టింది. కోటి మంది ప్రజలు రేషన్ కార్డులకు అర్హులని తేలింది. కానీ తాము ఇక రేషన్ కార్డులు జారీ చేసేది లేదని ప్రభుత్వం చెబుతోందని భూషణ్ పేర్కొన్నారు. ఈ దశలో అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యా భటి మాట్లాడుతూ జాతీయ ఆహార భద్రతా చట్టం కింద అర్హులైన వారందరికీ ప్రస్తుతం కేంద్రం రేషన్ ఇస్తోందని చెప్పారు. ఆ వెంటనే అన్ని వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని బెంచ్ కేంద్రాన్ని ఆదేశించింది.

వాస్తవాలను విశ్లేషిస్తే బెదిరింపులా?

- ప్రొఫెసర్ కె నాగేశ్వర్ పై ఈటల అనుచరులు బెదిరింపులు మానుకోవాలి : కేవీపీఎస్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు, మేధావి ప్రొఫెసర్ కె నాగేశ్వర్‌ను మల్కాజ్‌గిరి ఎంపీ నాయకులు ఈటల రాజేందర్ అనుచరులు వరుసగా ఫోన్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ, టి స్కైలాబ్‌బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తక్షణమే ఆ బెదిరింపులు మానుకోవాలనీ, పోలీసు ఉన్నతాధికారులు నాగేశ్వరకు రక్షణ కల్పిస్తూ, బెదిరింపులకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో, దేశంలో జరుగుతున్న పరిణామాలను రోజువారీగా విశ్లేషిస్తూ ప్రజలకు వాస్తవాలను తెలియజేస్తున్న నాగేశ్వర్ పై ఈటల అనుచరులు బెదిరింపులకు పాల్పడటం అప్రజాస్వామిక చర్య అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలు నిరాధారమైతే ఈటల ప్రెస్ మీట్ ద్వారా లేదా మరో వీడియో ద్వారా తన అభిప్రాయాలు తెలియజేయొ చ్చునని గుర్తు చేశారు. భావ ప్రకటన స్వేచ్ఛను సైతం హరించే బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ నియంత పోకడలు ప్రజాస్వామ్యంలో కుదరదని హెచ్చరించారు. ఇప్పటికైనా నాగేశ్వర్‌పై బెదిరింపులకు పాల్పడిన దానికి సంబంధించి ఈటల రాజేందర్ తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎన్జీవో కేంద్రసంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని హాస్టల్ వెల్ఫేర్ అధికారుల సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవో కేంద్రసంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సోమవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో కార్యాలయంలో సంక్షేమ అధికారుల రాష్ట్రసంఘం ఆధ్వర్యంలో అత్యవసర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. వసతి గృహ సంక్షేమ అధికారుల రాష్ట్ర ఫోరం అధ్యక్షులు ఎండీ ఖాజా గౌస్ మొయినుద్దీన్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా టీఎన్జీవోస్ అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని, అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, ముజీబ్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యా సంవత్సరం ప్రారంభంలో వసతి గృహాలకు సరుకుల సరఫరా కోసం టెండర్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖ అధికారులు పిలుస్తున్నారని చెప్పారు. అందులో పాల్గొన్న గుత్తేదారులు టెండర్లు తీసుకున్న తర్వాత సంక్షేమ హాస్టళ్లకు నామమాత్రంగా ఒకటి లేదా రెండు నెలలు మాత్రమే సరుకులను సరఫరా చేస్తున్నారని అన్నారు. మెనూ తయారు చేసేటప్పుడు కిరాణా సరుకులకు ఎక్కువ ధర, గుడ్లు, చికెన్, మటన్, పాలు, కూరగాయలకు తక్కువ ధర వేసి టెండర్లను పిలుస్తున్నారని వివరించారు. గురుకుల పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులుఉండడం వల్ల అక్కడ టెండర్ వేసి, సంక్షేమ హాస్టళ్లలో టెండర్లు వేయడానికి ముందుకు రావడం లేదన్నారు. అధికారుల ఒత్తిడితో టెండర్ వేసి, తూతూ మంత్రంగా ఒకటి, రెండు నెలలు సరఫరా చేసి తర్వాత చేయడం లేదని ఆరోపించారు. గుత్తేదారులు సరఫరా చేయకపోవడం వల్ల ఆ భారం వసతి గృహ సంక్షేమ అధికారులపై పడుతున్నదని అన్నారు. సిలిండర్ గ్యాస్‌కు టెండర్లు వేయకపోవడం వల్ల సంక్షేమ హాస్టళ్ల అధికారులే భరిస్తున్నారని చెప్పారు. హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరాయన్నారు. వంటమనిషి, కామాటి, శానిటేషన్ వర్కర్, వాచ్‌మెన్లను నియమిస్తే పిల్లలకు ఎక్కువ న్యాయం జరుగుతుందని చెప్పారు. మెస్‌చార్జీలు ఆరు నుంచి ఎనిమిది నెలలకోసారి చెల్లిస్తున్నారని అన్నారు. గ్రీన్ చానెల్ ద్వారా ప్రతినెలా వచ్చేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన సరుకులు వచ్చేలా చూడాలని కోరారు.

ముప్పేటా వరద ముప్పు

- ఎటు చూసినా (క)న్నీరే.. • రెండ్రోజులుగా జలదిగ్బంధనంలోనే ప్రజలు • సహాయక చర్యల్లో అధికార యంత్రాంగం

ఎడతెరిపి లేని వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి.. వరదలు ముప్పేటా ముప్పు తెచ్చాయి. ఎటు చూసినా వరదే కనిపిస్తోంది. వరదల నుంచి ఇప్పుడిప్పుడే బయట పడటం కనుచూపు మేరలో కనిపించడం లేదు. మూడ్రోజులుగా భారీ నుంచి మోస్తరు వర్షాలు ఏకధాటిగా కురుస్తుండటంతోపాటు.. ఎగువ రాష్ట్రాల నుంచి వరదలు పోటెత్తడంతో ప్రాజెక్టులు, చెరువులు, వాగులు నిండి గ్రామాలను నీరు చుట్టుముట్టింది. ఇండ్లన్నీ జలదిగ్బంధమయ్యాయి. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాలతోపాటు సూర్యాపేట జిల్లాల్లో వరదలు అపార నష్టాన్ని మిగిల్చాయి. ప్రజలంతా రెండ్రోజులుగా వరదల్లోనే బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, సీపీఐ(ఎం), ఇతర రాజకీయ పార్టీల నేతలు ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపడుతున్నారు. కొట్టుకుపోయిన రోడ్లు, రైల్వే ట్రాక్‌లకు తాత్కాలిక మరమ్మతులపై అధికారులు పరిశీలించారు. తక్షణం చర్యలకు ఉపక్రమించారు.

నవతెలంగాణ- మొఫసిల్ యంత్రాంగం

రెండ్రోజులుగా దంచికొడుతున్న వానలతో కరీంనగర్ ఉమ్మడి జిల్లా తడిసి ముద్దయింది. కాసేపు గెరువిస్తూ.. కాసేపు కుండపోతగా వాన కురిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 3268 చెరువుల్లో దాదాపు 2వేల చెరువులన్నీ మత్తడి దూకుతున్నాయి. కల్వర్టులు ఉధృతంగా ప్రవహిస్తుండగా.. పంట చేలు జలసంద్రమయ్యాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం మూలవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో మామిడిపల్లి- నిజామాబాద్, వెంకట్రావుపేట- బావుసాయిపేట, వట్టిమల్ల-నిమ్మపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాజన్నసిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం జవారిపేట-నర్సక్కపేట గ్రామాల మధ్య బిక్కవాగు ఉధృతితో రాకపోకలు నిలిచిపోయాయి. వేములవాడ పట్టణ శివారులోని కోనాయిపల్లి బుడగజంగాల కాలనీలోని లోతట్టు ప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో గుడిసెల్లోకి వరద చేరింది. బాధితులను అధికారులు సురక్షిత ప్రాంతానికి తరలించి నిత్యావసర సరుకులు అందించారు.



గల్లంతైన ఇద్దరు మృతి

కాల్వశ్రీరాంపూర్ మండలం మీర్జంపేట కారోబార్ పవన్ కొత్తపల్లి-మల్యాల సమీపంలోని నక్కలవాగు కల్వర్టు వద్ద బైక్‌పై ప్రయాణిస్తుండగా.. ప్రవాహంలో కొట్టుకుపోయాడు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. ఇదే మండలం కునారం చెరువులో చేపల వేటకు వలలు కట్టేందుకువెళ్లిన గోస్కులు కుమార్(45) సైతం వరద ప్రవాహంలో గల్లంతై చనిపోయాడు.

పంట పొలాల్లో ఇసుక మేటలు

సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఈదురుగాలులకు ఇండ్ల రేకులు లేచిపోయాయి. ముకుందాపురం ఎస్సీ కాలనీలో45 ఇండ్లలోకి నీరు చేరడంతో రాత్రంతా నిద్ర లేకుండా జాగారం చేశారు. వరద నీటికి అడ్డుగా వున్న చర్చి గోడను పగలకొట్టడంతో సమస్య తగ్గింది. వేలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. చెర్వులు, వాగుల కింద సాగు చేసిన వరి పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోయాయి. నడిగూడెం మండల పరిధిలోని రామచంద్రపురం గ్రామం వద్ద గండి పడిన సాగర్ ఎడమ కాలువను ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతి, జిల్లా అధికారులతో కలిసి భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పరిశీలించారు. బొల్లం మల్లయ్య యాదవ్ కూడా పరిశీలించారు. చివ్వెంల మండలంలో చాలా గ్రామాలకు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి.



వాగుల ఉగ్రరూపం..

నాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పంట పొలాలు జలమయమయ్యాయి. పల్లి, పత్తి, వరి చేలు నీట మునిగాయి. జిల్లా కేంద్రంలోని 11వ వార్డులో నసీం బేగం, సాధికా బేగం, జహీర్ ఇండ్లు కూలాయి. వాటిని సీపీఐ(ఎం) జిల్లా నాయకత్వం పరిశీలించింది. గండీడు, మహ్మదాబాదు మండలాల్లో రహదారులు తెగిపోయాయి. జడ్చర్ల నియోజకవర్గంలో ప్రభుత్వ నియోజకవర్గ ఆస్పత్రి 24 గంటలుగా వరద నీట్లోనే ఉంది. మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోడూరు గ్రామ శివారులో కస్తూర్బా విద్యాలయం చుట్టూ నీరు చేరింది. భారీ వర్షాలతో రైల్వే బ్రిడ్జి కింద నీరు నిల్వ ఉండటంతో శాశ్వత పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడుతామని మహబూబ్‌నగర్ ఎంపీ డికె. అరుణ అన్నారు.

వర్షాలు పైన.. వరదలు ఇక్కడ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ వర్షం లేకపోయినప్పటికీ ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా వరద కష్టాలు కొనసాగుతున్నాయి. శని, ఆదివారాల్లో ఉమ్మడి జిల్లాలో కురిసిన వర్షాలతో జనజీవనం అతలాకుతలం కాగా, సోమవారం వర్ష భయం కొంత వీడినా వరద ముప్పు మాత్రం తగ్గలేదు. ఎగువన మహారాష్ట్ర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు.. అక్కడి ప్రాజెక్టుల నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆ ప్రభావం జిల్లా మీద పడుతోంది.


పెన్‌గంగ ఉగ్రరూపం

తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్దున ఉన్న పెన్‌గంగ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. పెన్‌గంగ బ్రిడ్జికి ఆనుకొని ప్రవహిస్తుండటంతో పరివాహక ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయి. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ప్రాణహిత నది సైతం ఉధృతంగా ప్రవహిస్తోంది. బ్యాక్ వాటర్ కారణంగా పలు పంట పొలాలు నీటిలోనే ఉండిపోయాయి. బేల మండలం సాంగిడి, బెదోడా గ్రామాలను మూడు వైపులా వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వచ్చింది.



ఎస్సారెస్పీ నీటిని విడుదల చేయడంతో వరద ఉధృతి వల్ల నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం సావేల్-తడపాకల్ గ్రామాల మధ్యన గోదావరి నదిలో ఉన్న సాంబయ్య ఆశ్రమంలోని ముగ్గురు సాధువులు సంతోష్, నారాయణ, ముత్తెన్న అక్కడే చిక్కుకుపోయారు. వీరిని ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సురక్షితంగా బయటకు తీసుకొచ్చింది.

వర్షపు నీటిలో పోలామా కమ్యూనిటీ



రంగారెడ్డి జిల్లాలో శేరిలింగంపల్లిలో అత్యధికంగా కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే గాంధీ పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. శంకర్‌పల్లి మండలంలోని మోకిలా పోలామా కమ్యూనిటీలో 212 విల్లాలు ఉన్నాయి. అందులో 1000 మంది వరకు ఉంటున్నారు. వర్షాలకు పోలామా కమ్యూనిటీ ఏరియా మొత్తం మోకాళ్ల లోతు నీటితో నిండిపోయింది. ఘటనా స్థలాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిశీలించారు. ఈ ప్రాంతంలో గతంలో చెరువు ఉండేదని తెలుస్తోంది. అధికారులు విల్లాల నిర్మాణాలకు పర్మిషన్స్ ఇవ్వడం వల్లనే ఈ పరిస్థితి వచ్చిందని ఎమ్మెల్యే ఆరోపించారు. హిమాయత్‌సాగర్‌ను కలెక్టర్ శశాంక్ పరిశీలించారు.

రైల్వే ట్రాక్‌లను పరిశీలించిన డీఆర్‌ఎం



మహబూబాబాద్ జిల్లా కే సముద్రం మండలలోని తాళ్ల పూసలపల్లి, ఇంటికన్నె రైల్వే స్టేషన్‌ల సమీపంలో భారీ వర్షానికి దెబ్బతిన్న రైలు పట్టాలను డీఆర్‌ఎం అరుణ్ కుమార్ జైన్ పరిశీలించారు. ఈ రెండు స్టేషనులను ఎక్కువ సిబ్బంది, మిషనరీ ఉపయోగించి త్వరలో మరమ్మతులు పూర్తి చేసి రైలు రాకపోకలకు అనుకూలంగా చేస్తామని తెలిపారు.

నిండు కుండలా జంట జలాశయాలు

మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలు హైదరాబాద్ నగరాన్ని అతలాకుతలం చేశాయి. నగరంలో 9 సెంటీమీటర్ల మేర వర్షం కురియడంతో అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. వీధులు, కాలనీలు చెరువులను, జలాశయాలను తలపించాయి. వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. చెట్లు పెద్దఎత్తున కూలిపోయాయి. జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌తో పాటు హుస్సేన్ సాగర్‌లోకి పెద్దఎత్తున్న వరద నీరు చేరుతోంది. బంజారా, పికెట్, కూకట్‌పల్లి, బుల్కాపూర్ నాలాల నుంచి పెద్దఎత్తున వరద నీరు వస్తుండటంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవెల్ దాటడంతో అధికారులు నాలుగు గేట్లు ఎత్తి దిగువన ఉన్న మూసీ నదికి నీటిని వదిలారు.

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని పైతర గ్రామ పటేల్ చెరువు, పించెరువు నిండుకుండలా మారి అలుగులు పారాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల్లో ఇండ్లు దెబ్బతిన్నాయి. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండల కేంద్రంలోని పాత చెరువు అలుగుకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారు. బెజ్జంకిలో వాగులో జాలరి గల్లంతయ్యారు.

తెగిన సీతారామ ప్రాజెక్టు కాలువ

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం బంద్రిగుండ పంచాయతీ పరిధిలో కోయ గట్టు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ తెగింది. కరకగూడెం మండలంలో కరకగూడెం, చిరమళ్ళ గ్రామాల ప్రధాన రహదారి, పెద్దవాగు బ్రిడ్జి కోతకు గురైంది. ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర రెడ్డి బ్రిడ్జిని పరిశీలించారు. వరదలతో దెబ్బతిన్న ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డు బ్రిడ్జి మరమ్మతు పనులను ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి పరిశీలించారు.











బిజినెస్

ఎఫ్‌డిఐలకు గేట్లు తెరవండి



- సంస్కరణలు వేగవంతం చేయాలి : రాష్ట్రాలకు కేంద్రం సూచన

న్యూఢిల్లీ: విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించేలా నిర్ణయాలు తీసుకోవలని రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం సూచిస్తుంది. ఇందుకోసం కావాల్సిన అవనుమతులు, భూములు, భవన నిర్మాణాల నిబంధనలను సడలించాలని కోరినట్లు ది ఫైనాన్సియల్ ఎక్స్‌ప్రెస్ ఓ కథనంలో తెలిపింది. 'ఎఫ్‌డిఐలకు కావాల్సిన అనుకూల అంశాలను నీతి అయోగ్ రూపొందిస్తున్న 'ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రెండ్లీ చార్టర్'లో చేర్చనుంది. ఎఫ్‌డిఐ ఆకర్షణలో రాష్ట్రాల ప్రగతికి ర్యాంక్‌లు ఇచ్చే యోచన కూడా ఉంది. నిర్దిష్ట కంపెనీలను లక్ష్యంగా చేసుకోవాలి. ప్రస్తుత పెట్టుబడిదారులు ఇతర రాష్ట్రాలకు మకాం మార్చకుండా స్థానికంగా తమ కార్యకలాపాలను విస్తరించేలా చూసుకోవాలి. అవసరమైతే ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా రాష్ట్రాలు తమ విధానాలను మార్చుకోవాలి' అని ఓ అధికారి పేర్కొన్నారు. పెట్టుబడుల కోసం రాష్ట్రాలు భూ బ్యాంకులను ఏర్పాటు చేయాలని, భూమి అవసరాలను తీర్చడానికి అవసరమైన సంస్కరణలను అమలు చేయాలని ఇటీవల ప్రధాని నరేంద్ర మోడీ కూడా ఓ సమావేశంలో పేర్కొన్నారు.

ఎఫ్‌డిలపై ఐడిబిఐ బ్యాంక్ వడ్డీ పెంపు

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని ఐడిబిఐ బ్యాంక్ పరిమిత కాలానికి మదుపు చేసే ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్ స్కీమ్‌పై మెరుగైన వడ్డీ రేట్లను అందిస్తున్నట్లు తెలిపింది. బ్యాంక్ 444 రోజులు, 375 రోజుల ప్రత్యేక పదవీకాలాలపై వడ్డీ రేట్లను పెంచినట్లు వెల్లడించింది. వీటిపై వరుసగా గరిష్ట వడ్డీ రేటు ఏడాదికి 7.85 శాతం, 7.75 శాతం చొప్పున అందిస్తోన్నట్లు ఆ బ్యాంక్ పేర్కొంది. అధిక రాబడి కోరుకునే వినియోగదారులకు ఉత్సవ్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ని మరింత ఉత్తమ ఎంపికగా చేస్తుందని తెలిపింది. ఈ పరిమిత వ్యవధి ఆఫర్ 2024 సెప్టెంబర్ 30 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

జెఎల్ఆర్‌తో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఒప్పందం

న్యూఢిల్లీ : ప్రముఖ లగ్జరీ కార్ల కంపెనీ జెఎల్ఆర్ ఇండియాతో దిగ్గజ ప్రయివేటు రంగ విత్త సంస్థ హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో జెఎల్ఆర్ ప్రాధాన్య వాహన ఫైనాన్షియర్ కానుందని ఆ బ్యాంక్ పేర్కొంది. రెండు బ్రాండ్‌ల మిశ్రమ బలాన్ని ఉపయోగించడం ద్వారా వినియోగదారులకు అంతరాయం లేని ఫైనాన్సింగ్ ఎంపికలు, ఆధునిక లగ్జరీ కార్ల కొనుగోలు అనుభవాన్ని అందించడమే లక్ష్యమని తెలిపింది. ఈ ఒప్పందంలో జెఎల్ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబ, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ రిటెయిల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రా సంతకాలు చేశారు.

ఇండియన్ ఆయిల్ ఛైర్మన్‌గా సతీష్ కుమార్



హైదరాబాద్ : ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛైర్మన్‌గా వి సతీష్ కుమార్ అదనపు బాధ్యతలు చేపట్టారు. అక్టోబర్ 2021 నుంచి డైరెక్టర్‌గా మార్కెటింగ్ విభాగంలో తన పాత్రలో కొనసాగుతున్నారు. ఇప్పుడు ఛైర్మన్‌గా కూడా వ్యవహరిస్తారు. 35 ఏళ్ల కెరీర్‌లో దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో సేవలందించారు. సతీష్ కుమార్ మెకానికల్ ఇంజనీరింగ్ చేశారు. స్లోవేనియాలోని లుబ్జానా విశ్వవిద్యాలయం నుంచి మేనేజ్‌మెంట్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ చేశారు.

వేగవంతంగా క్యాబ్ బుకింగ్స్

- మన యాత్రి వెల్లడి

హైదరాబాద్ : నగరానికి చెందిన క్యాబ్, ఆటో బుకింగ్ యాప్ 'మన యాత్రి'కి విశేష ప్రాచుర్యం లభిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. పీపుల్ ఫస్ట్ విధానంతో మన యాత్రి 35,000 ఆటోలు, 25,000 క్యాబ్ సర్వీసులతో సేవలందిస్తున్నట్లు పేర్కొంది. ఆటోలకు సగటున 30 సెకన్లు, క్యాబ్‌లకు 40 సెకన్ల సమయంతో వేగవంతమైన బుకింగ్‌లను అందిస్తున్నట్లు తెలిపింది. ఇది డ్రైవర్లకు కమీషన్ లేకుండా రూ.800 కోట్లు, ప్రయాణికులకు వారి ప్రయాణ ఖర్చులపై దాదాపు రూ .100 కోట్లు ఆదా చేయడానికి సహాయపడుతుందని వెల్లడించింది.

హోటళ్లలో మహిళలు, పిల్లల భద్రతపై శ్రద్ధ వహించాలి

- మహిళా భద్రతా విభాగం డీజీపీ షికా గోయెల్

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని వివిధ స్థాయి హోటళ్లలో మహిళలు, పిల్లల భద్రత పట్ల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలనీ, అందుకు తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా భద్రతా విభాగం డీజీపీ షికా గోయెల్ స్పష్టం చేశారు. సోమవారం వివిధస్థాయి హోటళ్ల యాజమాన్యాలు, వాటి జనరల్ మేనేజర్లతో షికా గోయెల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా, హోటళ్లకు వచ్చే మహిళలు, చిన్నపిల్లలకు సంబంధించి వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె సూచించారు. హోటళ్లకు వచ్చేవారి గుర్తింపు కార్డులను ప్రత్యేకంగా పరిశీలించాలనీ, వాటిని రికార్డులలో నమోదు చేయాలని తెలిపారు.

బ్రహ్మకుమారీస్ సంస్థతో ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలి

- కోదండరామ్‌కు ఏఐవైఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎస్సీ గురుకులాల్లోని విద్యార్థులకు మానసిక ఉల్లాస తరగతులను ఆధ్యాత్మికం పేరుతో మత రాజకీయాలను బోధించే బ్రహ్మకుమారీస్ సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు టీజేఎస్ అధినేత, ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వలీఉల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు టి సత్యప్రసాద్ కలిసి వినతిపత్రం సమర్పించారు. శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసే గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి నిర్ణయాలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని విద్యార్థుల్లోకి తీసుకెళ్లడం కోసమే బ్రహ్మకుమారీస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నారని విమర్శించారు. విద్యార్థులకు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే విధానాలను అవలంభించాలని రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఉందని గుర్తు చేశారు. కానీ గురుకులాల్లోని విద్యార్థులకు మతబోధనను చెప్పించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కోదండరామ్ మాట్లాడి ఆ ఒప్పందాన్ని రద్దు చేయించేలా చొరవ చూపాలని కోరారు. ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

హంస హోమియోపతి కళాశాలలో పాలియేటివ్ కేర్ ఇంటిగ్రేషన్ వర్క్‌షాప్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హంస హోమియోపతి వైద్య కళాశాల , పరిశోధన కేంద్రం, నాప్ క్రైమ్ తెలంగాణ చాప్టర్ అనుబంధంతో సంయుక్తంగా పాలియేటివ్ కేర్ ఒరియెంటేషన్, ఇంటిగ్రేషన్, ఇంటర్వెన్షన్ జాతీయ వర్క్‌షాప్‌ను కళాశాల ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుష్ డైరక్టర్ ఎం.ప్రశాంతి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి మనిషి తన జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు అన్ని రకాల వైద్య విధానాలు వాడవలసిన అవసరం ఉందని తెలిపారు.జె.యస్.పి యస్ ప్రభుత్వ హోమియోపతిక్ వైద్య కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ సి.హెచ్.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అల్లోపతీ , ఆయుర్వేద , యునాని, హోమియో , నేచురోపతి , సిద్ధ వంటి వైద్య విధానాల ప్రాముఖ్యతను తెలిపారు. హంస హోమియోపతి వైద్య కళాశాల డైరక్టర్ డాక్టర్ ఉమేష్ అక్కలదేవి మాట్లాడుతూ క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్ , పక్షవాతం వంటి వ్యాధులకు పాలియేటివ్ కేర్ చాలా అవసరం ఉంటుందని , ఈ వర్క్‌షాప్ ద్వారా విషయ పరిజ్ఞానం పొందవచ్చని తెలిపారు.

'వరద'వాడ

బుడమేరు విలయం...కృష్ణా ఉగ్రరూపం

ముంపులో 3.5 లక్షలమంది

బుడమేరు ఉధృతికి సోమవారం మహోగ్ర కృష్ణ తోడయింది. దీంతో విజయవాడ వరద వాడగా మారింది. బుడమేరు వరదతోనే నిస్సహాయులుగా మారిన నగర ప్రజానీకాన్ని కృష్ణమ్మ మహా ప్రవాహం నిశ్చేష్టులను చేసింది. శతాబ్దకాలంలో ఎన్నడూ లేని విధంగా 11.43 లక్షల క్యూసెక్కుల వరద ప్రకాశం బ్యారేజి నుండి సముద్రానికి పరుగులు తీసింది. దీంతో అటు విజయవాడతోపాటు తాడేపల్లిలోని పలు ప్రాంతాలు ముంపు బారిన పడ్డాయి. 3.50 లక్షల మంది బాధితులుగా మారారు. బాధిత ప్రజానీకానికి అటు ప్రభుత్వంతో పాటు, వివిధ ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలు విస్తృతంగా సాయం చేస్తున్నాయి. అయినా, తీవ్ర ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు సాయం అంతంతమాత్రంగానే అందుతోంది. మరోవైపు రానున్న 24 గంటల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందంటూ వాతావరణ శాఖ జారీ చేసిన హెచ్చరిక ప్రజానీకాన్ని ఆందోళనకు గురిచేస్తోంది.





ఏపీలో వరద ప్రాంతాల్లో పర్యటిస్తున్న సీఎం చంద్రబాబు...బాధితుల కష్టాలు...

వైఎస్సార్‌కు సీఎం రేవంత్‌రెడ్డి నివాళులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో రాజశేఖర్ రెడ్డికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్ : మహేష్ కుమార్ గౌడ్

ఒక ముఖ్యమంత్రిగానే కాకుండా పేద ప్రజల కోసం అనేక పథకాలు తెచ్చిన మహనీయునిగా వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. సోమవారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంతకు ముందు పంజగుట్టలోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్సార్ తనను ఒక ముఖ్యమంత్రిగా కాకుండా ఒక సహచరునిగా అందరితో కలిసి ఉండేవారని గుర్తుచేసుకున్నారు. రాష్ట్రంలో వరదల నేపథ్యంలో తక్షణ సాయం ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే బీఆర్ఎస్ బురద రాజకీయం చేస్తున్నదని విమర్శించారు. టీపీసీసీ అధికార ప్రతినిధి భవాని రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం సరైన చర్యలు తీసుకుంటే వర్షానికి హైదరాబాద్ అతలాకుతలమయ్యే పరిస్థితి వచ్చేది కాదని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయ సంస్థ చైర్మెన్ రియాజ్ మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వం ప్రకటించిన టోల్ ఫ్రీ నెంబర్‌ను ఉపయోగించుకుని తమ సమస్యలు తెలపాలని కోరారు.

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ఏఐసీసీ సూచనలు పాటించాలి : మహేష్ కుమార్ గౌడ్

యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఏఐసీసీ సూచనలు పాటించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ కోరారు. కాంగ్రెస్ నాయకులెవరూ యూత్ కాంగ్రెస్ ఎన్నికల్లో పాల్గొనొద్దనీ, ప్రచారం చేయొద్దని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేందుకు వీలుగా ఎవరూ ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కాని పాల్గొనద్దని కోరారు. యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు మాత్రమే ఎన్నికలలో పాల్గొనాలని ఏఐసీసీ సూచించినట్టు తెలిపారు.

వైఎస్సార్‌కు చిన్నారెడ్డి నివాళులు

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి దివంగత వై.ఎస్.రాజశేఖర్ రెడ్డికి రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. వైఎస్ఆర్ వర్ధంతి సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని పంజగుట్ట సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా వైఎస్సార్ పాలనను సాగించారని ఈ సందర్భంగా చిన్నారెడ్డి కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ విషయంలో అనేక నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందని తెలిపారు. వైఎస్సార్ లేని లోటు తీరనిదంటూ వైఎస్ఆర్‌ను గుర్తు చేసుకున్నారు.

ఆనంద్ సినీ సర్వీస్‌కు భూ కేటాయింపులపై విచారణ వాయిదా

- సుప్రీంకోర్టు ఆశ్రయించిన బీఆర్ఎస్ నేత హరీశ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బంజారా హిల్స్‌లో ఆనంద్ సినీ సర్వీస్‌కు భూ కేటాయింపులపై హైకోర్టు ఆదేశాలు సవాల్ చేస్తూ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ధర్మాసనం వాయిదా వేసింది. 2008లో ఆనాటి ఉమ్మడి ఏపీ సర్కార్ ఆనంద్‌సినీ సర్వీస్‌కు ఎకరా రూ.8,500 చొప్పున ఐదు ఎకరాలు భూమిని కేటాయించింది. దీన్ని వ్యతిరేకిస్తూ హరీశ్‌రావు, తదితరులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పు సవాల్ చేస్తూ హరీశ్ రావు సుప్రీంకోర్టును పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది.

ఈ పిటిషన్ విచారణలో భాగస్వామ్యం కావడానికి జస్టిస్ సంజయ్ కుమార్ నిరాకరించారు. దీంతో జస్టిస్ సంజయ్ కుమార్ లేని ధర్మాసనానికి బదిలీ చేయాలని సీజేఐ దష్టికి తీసుకెళ్లాలని జస్టిస్ సంజీవ్‌ఖన్నా రిజిస్ట్రీని ఆదేశించారు. తదుపరి విచారణ నవంబరు 4తో మొదలయ్యే వారానికి బదిలీ చేస్తున్నట్టు వెల్లడించారు.

ప్రమాదంలో లౌకికవాదం

- వైఎస్ఆర్ సార్మక ఉపన్యాసంలో సిద్ధార్థ్ వరదరాజన్




న్యూఢిల్లీ : దేశంలో లౌకికవాదం ప్రమాదంలో ఉందని, పదేళ్లుగా లౌకికవాదంపై దాడి జరుగుతోందని ప్రముఖ పాత్రికేయులు సిద్ధార్థ్ వరదరాజన్ పేర్కొన్నారు. సోమవారం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని 'ఎమెస్కో' ఆధ్వర్యాన ఢిల్లీలోని ఇండియన్ ఇస్లామిక్ సెంటర్‌లో 'డాక్టర్ వైఎస్ఆర్ సార్మక ఉపన్యాసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కెవిపి రామచంద్రరావు, హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి రఘువీరారెడ్డి, కొప్పుల రాజు, గిడుగు రుద్రరాజు తదిరులు వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా 'ది ఐడియా ఆఫ్ సెక్యులరిజం' అనే అంశంపై ముఖ్య అతిథిగా విచ్చేసిన జర్నలిస్టు సిద్ధార్థ్ వరదరాజన్ ప్రసంగించారు. దేశంలో ఓ వర్గాన్ని టార్గెట్ చేస్తూ, ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జై శంకర్ వంటి నేతలు ప్రసంగాలు చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. దేశంలో మొట్టమొదటిసారి ముస్లిములకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత వైఎస్ఆర్ దేనని సీనియర్ జర్నలిస్టు రామచంద్రమూర్తి అన్నారు.

ఏఐపై మరింత అవగాహన కల్పించాలి

- ఐటీ సెక్రెటరీ జయేష్ రంజన్

నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రస్తుతం సమాజంలో ఏఐ విస్తృతంగా వ్యాపించిందని, దానిపై సామాన్యులకు, విద్యార్థులకు.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మరింత అవగాహన అవసరమని తెలంగాణ ఐటీ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్ అన్నారు. తెలంగాణలోని యువతకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ అందించేందుకు టాస్క్ సంస్థతో మాటా ఒప్పందం కుదుర్చుకోవడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ టాస్క్ కార్యాలయంలో టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా, మాట ఫౌండర్ శ్రీనివాస్ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ మాట్లాడుతూ.. మొదటగా ఈ కార్యక్రమం కామారెడ్డి జిల్లాలో ప్రారంభించగా 200 మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. హెచ్ఐసీసీలో ఈనెల 4, 5 తేదీల్లో ఏఐ సమ్మిట్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తెలంగాణలో అతిపెద్ద ఏఐ సిటీని 100 ఎకరాల్లో నిర్మించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుందన్నారు. మాట



ఫౌండర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. వారానికి 4 క్లాస్‌లు.. రోజుకు 2 గంటలు పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ ఉంటుందని చెప్పారు. నిరుద్యోగ యువతకు నూతన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించేందుకు(టాస్క్)తోపాటు మరికొన్ని సంఘాలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, భవిష్యత్‌లో 'మాట' ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టాస్క్ సంస్థ ప్రతినిధులు, మాట సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రయివేటు ప్రయాణీకుల కోసం

జనరల్ ఏవియేషన్ టెర్మినల్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రారంభం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



ప్రయివేటు జెట్ యజమానులు, వినియోగదారుల కోసం ప్రత్యేకంగా అత్యాధునిక జనరల్ ఏవియేషన్ టెర్మినల్‌ను రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించింది. శంషాబాద్ నుంచి వ్యాపార లేదా వ్యక్తిగత ప్రయాణానికి ఉద్దేశించిన చార్టర్డ్ విమానాల ద్వారా ప్రయాణించే ప్రయాణీకుల విభిన్న అవసరాలను సులభతరం చేయడమే కొత్త టెర్మినల్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ సందర్భంగా జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ సీఈవో ప్రదీప్ పణికర్ మాట్లాడుతూ ఆర్‌జీఐఏలో ప్రీమియం జనరల్ ఏవియేషన్ టెర్మినల్‌ను ఆవిష్కరించడం మాకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉన్నతస్థాయి కలిగిన వ్యక్తులు, అభివద్ధి చెందుతున్న ఫార్మాస్యూటికల్, ఐటి పరిశ్రమలతో అభివద్ధి చెందుతున్న ఆర్థిక శక్తి కేంద్రాలలో హైదరాబాద్ ఒకటని అభిప్రాయపడ్డారు. ఎంఎన్‌సీలు ఈ ప్రాంతంలో గ్లోబల్ కెపాసిటీ సెంటర్లను అభివద్ధి చేయడం వల్ల ప్రైవేట్ జెట్ కదలికలు పెరిగాయని గుర్తు చేశారు. ఎగిరే అనుభవాన్ని పునర్నిర్వచించే ఈ కొత్త సదుపాయం అసాధారణ ప్రయాణ అనుభవానికి కొత్త ప్రమాణాన్ని ఏర్పరుస్తుందన్నారు. మా ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి అనుభవాన్ని అందించాలనే నిబద్ధతతో, రాబోయే సంవత్సరాల్లో క్వాలిటీని పెంచడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. అద్భుతమైన లాంజ్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఎయిర్‌పోర్టు అంతర్గత సేవల సమయాలను మరింత తగ్గిస్తుందని చెప్పారు.

పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలు, పునరావాస కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అవసరమైన వారందరికీ టెస్టులు చేసి, మెడిసిన్ అందజేయాలని సూచించారు. వరదల తీవ్రత ఎక్కువగా ఉన్న ఖమ్మం జిల్లాలో పది మెడికల్ టీమ్‌లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రతి టీమ్‌లో స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది, టెస్టులు చేయడానికి అవసరమైన పరికరాలు, మెడిసిన్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖమ్మం మెడికల్ క్యాంపుల ఏర్పాటు, నిర్వాహణ బాధ్యతలను హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్‌కు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. వరదల తర్వాత జ్వరాలు, డయేరియా వంటి రోగాలు ప్రబలే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు వ్యాధులపై అవగాహన కల్పించాలని కోరారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేయాలనీ, బాధితుల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణి, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ రవిందర్ నాయక్‌తో మంత్రి సోమవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

కాంగ్రెస్ మాట నిలబెట్టుకోకుంటే బీసీల నుంచి నిరసన

- బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరు గౌరీశంకర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీసీల కులగణన స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు మాట్లాడాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యులు జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటపై నిలబడి చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకోకపోతే బీసీల నుంచి తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుందని సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కులగణన చేయాలనీ, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సిద్దేశ్వర పటేల్, బీసీ నేత జక్కని సంజయ్ కుమార్‌లను గాంధీ ఆస్పత్రి, కాచిగూడలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో దీక్ష చేస్తున్న వారిని సోమవారం గౌరీశంకర్ పరామర్శించారు. దీక్ష చేస్తున్న వారి ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తున్నదనీ, వారికి ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తారన్న ఆశలతో బీసీలు కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం బీసీల ఆశలను వమ్ము చేస్తున్నదని విమర్శించారు. కులగణన చేయకుండా ఓటర్ జాబితాల ఆధారంగా బీసీ రిజర్వేషన్లు చేస్తామని చెప్పడం ద్రోహం చేయడమే అవుతుందని తెలిపారు. దీక్ష చేస్తున్న వారిని సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి కూడా పరామర్శించారు.



రంగారెడ్డినగర్ ప్రధాన రహదారిలో వర్షపు నీరు స్తంభించుపోవడంతో నరకయాతన అనుభవిస్తున్న పాదాచారులు, వాహనదారులు... నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కష్టపడ్డ ప్రతి కార్యకర్తకూ పార్టీలో గుర్తింపు

- మాజీ మంత్రి హరీష్ రావు

నవతెలంగాణ-రాజేంద్రనగర్

బీఆర్ఎస్‌లో కష్టపడి పని చేసిన ప్రతి కార్యకర్తకూ తగిన సమ యంలో గుర్తింపు లభిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. సో మవారం అత్తాపూర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుర్రంపల్లి యాదగిరి మాజీ మంత్రి హరీష్ రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అత్తాపూర్ డివిజన్ అధ్యక్షునిగా నన్ను నియ మించాలని పార్టీలో కష్టపడి పనిచేసే పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తానని యాదగిరి హరీష్ రావును కోరారు. ఈ సందర్భంగా హరీష్ రావు మా ట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేస్తున్న యాదగిరికి తగిన గుర్తింపు, డివి జన్ అధ్యక్షునిగా నియమించాలని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ చె ప్పారని ఆయన అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యల మీద పోరాటం చేయాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

రెసిడెన్షియల్ పాఠశాలలపై నమ్మకం తగ్గకుండా చూడాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యార్థులకు ఇంటి దగ్గరి కంటే రెసిడెన్షియల్ పాఠశాలల్లోనే రక్షణ ఎక్కువగా ఉంటుందనే నమ్మకం తగ్గకుండా ఉండేలా విద్యార్థులను చూసుకోవాలని రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్‌ను మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఎలక్ట్రికల్ సమస్యలైన లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు, శానిటేషన్, వాడుకునేందుకు వీలుగా టాయిలెట్లు, వాడుకునే నీరు, పైప్ లైన్ల మరమ్మత్తుల వంటి చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రిన్సిపాల్స్‌ను ఆదేశించారు. ప్రయివేటు భవనాల్లో ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్వహిస్తున్న స్కూళ్లల్లో కనీస అవసరాలను తీర్చే విధంగా భవన యజమాలు మరమ్మతులను చేయించకుంటే వారికి ఇచ్చే అద్దెలో మినహాయించి మరమ్మతులు చేయించాలని ప్రిన్సిపాల్స్‌కు సూచించారు. చిన్న చిన్న సమస్యలతో రెసిడెన్షియల్ సూళ్ల ప్రతిష్టను తగ్గించకూడదని సూచించారు. మొరం పోయడం, కాంపౌండ్ వాల్, అదనపు తరగతి గదులు, టాయిలెట్లు, రూఫ్ లీకేజీ వంటి మేజర్ సమస్యలకు గాను, ప్రణాళికలు తయారు చేసి రీజినల్ కో-ఆర్డినేటర్‌కు పంపాలనీ, రీజినల్ కో-ఆర్డినేటర్ పరిశీలించి నివేదికలు తమకు పంపాలని కలెక్టర్ వివరించారు.

ఆహారం మెనూ ప్రకారం పరిశుభ్రంగా, రుచికరంగా ఉండేలా చూడాలన్నారు. సిద్ధంగా ఉన్న ఆహారాన్ని ముందుగా మెస్ కమిటీ వాళ్లు తిన్న తర్వాత పిల్లలకు పెట్టాలన్నారు. ప్రతి స్కూల్‌లో మెస్ కమిటీలను నిర్వహించాలని ఆదేశించారు. స్టోర్ రూంలో నాణ్యత గల వంట సామాగ్రిని తీసుకోవాలనీ, ఆ సామాగ్రిని జాగ్రత్తగా తడి లేకుండా నిల్వ చేయాలని సూచించారు. విద్యార్థులకు జ్వరం గానీ, ఏదైనా అనారోగ్యం కలిగితే రెండు రోజుల వరకు విడిగా ఉంచి వైద్యం చేయించాలనీ, తగ్గకుంటే దగ్గరలో ఉన్న పల్లె దవాఖాన, పీహెచ్‌సీ సెంటర్లలో చూపించాలని తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ పాఠశాలలో స్టాఫ్‌నర్స్ తప్పని సరిగా అందుబాటులో ఉండాలనీ, పల్లె దవాఖాన, పీహెచ్‌సీ సెంటర్లలోని డాక్టర్ల ఫోన్ నెంబర్లు, అంబులెన్సు ఫోన్ నెంబర్లు నర్సుల దగ్గర ఉండేలా చూడాలన్నారు. అవసరమైన మందులను డీఎంహెచ్‌ఓ నుంచి తీసుకోవాలని సూచించారు. బాలికల రెసిడెన్షియల్ స్కూల్స్ దగ్గర పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలనీ, అవసరమైతే గస్తీ కోసం అదనపు పోలీసులను కావాలని అడిగితే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్స్ పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమశాఖ అధికారి కేషురాం, ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్ కుమార్, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కె.వీణ, తదితరులు పాల్గొన్నారు.



దోమల నివారణకు స్ప్రే చేయాలి



- ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని జంట సర్కిళ్లయిన కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్ల ఉప కమిషనర్లు నర్సింహా, మల్లా రెడ్డిలు, వివిధ విభాగాల అధికారులతో, కుత్బుల్లాపూర్ స్థానిక ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ పాల్గొన్నారు. గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిళ్లలోని కాలనీలలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి వర్షపు నీటి ప్రభావాన్ని తగ్గించాలన్నారు. అదేవిధంగా ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణకై కాలనీలలో స్ప్రే చేయించాలి, అదేవిధంగా నీరు నిల్వ ఉండకుండా ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు గాలులకు కూలిన చెట్లను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో ఉన్న వారిని ఖాళీ చేయించాలన్నారు. అలాగే వర్షాలతో విద్యుత్ అంతరాయం లేకుండా విద్యుత్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంజనీరింగ్ ఈఈలు కిష్టప్ప, లక్ష్మీ గణేష్, డిఈలు రూపాదేవి, పాపమ్మ, ఏఈ మల్లారెడ్డి, రవీందర్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మాధవరం ఆకస్మిక తనిఖీ



నవతెలంగాణ-బాలానగర్

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో బస్తీ దవఖానలు ఏర్పాటు చేయడం ద్వారా పేద ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకొనే వారిని అలాంటి బస్తీ దవఖానాలను ప్రస్తుతం పట్టించుకునే నాథుడు లేడని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గం బాలానగర్ డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డితో కలిసి సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య వైద్యాధికారిణి మమతను ఆస్పత్రిలో ఎలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని అడిగి దవఖానలో ఉన్న రోగులతో కలిసి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో ఉన్న వైద్య సిబ్బందితో మాట్లాడి.. ఆస్పత్రి పరిస్థితులను తెలుసుకున్నారు. అదేవిధంగా వర్షాకాలం దృష్ట్యా డెంగ్యూ, మలేరియా, విషజ్వరాల పట్ల ఆశా కార్యకర్తలతో ఇంటింటి సర్వే నిర్వహించి రోగులకు చికిత్స కోసం బస్తీ దవాఖాన లేదా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. గతంలో బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో 80 నుండి 90 వరకు ప్రసూతి కాన్పులు జరిగేవని, ఇటీవల ఈ మధ్య సగానికి పడిపోవడం పట్ల వైద్యులను అందకుగల కారణాలను అడిగి తెలుసుకున్నారు. హాస్పిటల్లో పనిచేసే వైద్య సిబ్బందికి విష జ్వరాలు వస్తున్న సమయంలో సెలవులు పెట్టుకోవద్దని కోరారు. ప్రభుత్వ ఈ కార్యక్రమంలో బాలానగర్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మమతా, డాక్టర్ రాజ్యలక్ష్మి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మౌనిక, పిహెచ్ఎన్ రాములమ్మ, సూపర్ వైజర్ రజిత, స్వరూపరాణి, నాగార్జున తదితరులు ఉన్నారు.

కూకట్‌పల్లి యూపీహెచ్‌సీలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీలు..

కేపీహెచ్‌బీ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావుతో కలిసి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. హెల్త్ సెంటర్ డ్యూటీ డాక్టర్ కుమారి సౌమ్యతో మాట్లాడి అక్కడి పరిస్థితిని సమీక్షించారు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబ లుతున్న సమయంలో హెల్త్ సెంట ర్‌లో అందించే మందులు, వసతులు, తదితర సౌకర్యాలు అవస రమైన అంశాల గురించి అడిగి తెలుసుకున్నారు. హెల్త్ సెంటర్‌కి వచ్చిన వారితో (రోగులతో) మాట్లాడి వైద్య సేవలు, వైద్య సిబ్బంది గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సుశీల్ కుమార్, భాస్కర్ రావు, శారద తదితరులు పాల్గొన్నారు.



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ వర్ధంతి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

దివంగత ముఖ్యమంత్రి శ్రీ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్... షాపూర్ నగర్‌లోని తన నివాసం వద్ద ఆ మహానేత చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్ఆర్ సేవలను కొనియాడారు. ఆరోగ్య శ్రీ, ఫీజు రీఎంబర్స్మెంట్, రైతులకు ఉచిత విద్యుత్ అనేక సంక్షేమ పథకాలతో ప్రజల హృదయాలను గెలిచిన మహానేత వైస్సార్ అని కొనియాడారు. సమకాలీన రాజకీయాల్లో వైస్సార్ లోటు తీరనిది అని అన్నారు. వైస్సార్ ఆశయాల సాధనకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి అంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా సోమవారం కూకట్ పల్లి హౌసింగ్ బోర్డ్ కాలనీలోని టెంపుల్ బస్ స్టాప్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి వైఎస్ఆర్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో... నిర్వహించిన వర్ధంతి కార్యక్రమానికి ఆయన తో పాటు మాజీ అధ్యక్షుడు షేర్ సతీష్ రెడ్డి , పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి



- ఆ తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి
- బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలో సమగ్ర కుల గణన నిర్వహించి స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విక్రమ్‌గౌడ్ మాట్లాడుతూ ఎన్నికల హామీ, మ్యానిఫెస్టోలో పొందు పర్చిన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల లెక్కలు తేలిన తర్వాత రిజర్వేషన్ పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. 60 శాతం ఉన్న బీసీ జనాభాకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, రంగాల్లో అన్యాయమే జరుగుతుందన్నారు. జనాభా ధామాశ ప్రకారం బీసీలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాకు ఎంతో.. మాకు అంతా అనే నిదానంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా ఈ కలెక్టరేట్ల ముట్టడి చేపట్టినట్టు తెలిపారు. వెంటనే కుల గనణ నిర్వహించి రిజర్వేషన్లు పెంచకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధతం చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీసీ విద్యార్థి సంఘం మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు ఇంద్రం రజక, ప్రధాన కార్యదర్శి గౌతం ప్రజాపతి, సెక్రెటరీ పూస శివతేజ, అర్జున్, జాయింట్ సెక్రెటరీ సురేష్ ప్రజాపతి, మహేష్ రజక, మనోజ్ యాదవ్, బీసీ విద్యార్థి యువజన నాయకులు తదితరులు ఉన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- ఆటో యూనియన్ జిల్లా ఇన్‌చార్జి బెజ్జల కృష్ణమూర్తి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ఆటో కార్మికుల జీవితాల పట్ల వివక్ష చూపకుండా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆటో యూనియన్ జిల్లా ఇన్‌చార్జి బెజ్జల కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ ఐడీపీఎల్ క్రాంతి ఆటో యూనియన్ (ఏఐటీయూసీ) అనుబంధం సమావేశం రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్ యూనియన్ కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షులు వి.హరినాథ్ రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వంగాల శ్రీనివాసులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆటో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీ మెరకు రూ.12 వేలు ఆటో కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ఆటోరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని తెలిపారు. 2014 నుంచి ఆటో మీటర్ చార్జీలు పెంచకపోవడంతో.. కార్మికులు నష్టపోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. కార్మికులందరూ ఏకతాటిపై నిలచి పోరాటాలకు సన్నద్ధం కావాలని వారు పిలుపు నిచ్చారు. ఆటో కార్మికులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని వారు తెలిపారు. ఈ సమావేశంలో క్రాంతి ఆటో యూనియన్ అధ్యక్షుడు రాజ్ కుమార్, కార్యదర్శి ఎల్లస్వామి, కోశాధికారి కుమార్, సతీష్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



వర్షాలకు నేలకొరిగిన వృక్షాలు





ఆందోళన చెందుతున్న ప్రజలు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గత మూడు రోజులుగా ఎడతెరిపి కురుస్తున్న అస్నా తుఫాను వర్షాల బీభత్సానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం రంగారెడ్డినగర్ డివిజన్, పరిధిలోని ఏపీహెచ్‌బీ కాలనీలో పలు వీధుల్లో రెండు, మూడు వృక్షాలు కూకట్వేళ్లతో నేలకొరిగాయి. దీంతో కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడేం.. జరుగుతుందోనని భయం గుప్పెట్లో పెట్టుకోని కాలాన్ని వెల్లదిస్తున్నారు. తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.


జలమయమైన రోడ్లు : ఆందోళన చెందుతున్న ప్రజలు...

కురుస్తున్న వర్షాలకు కుత్బుల్లాపూర్, గాజుల రామారం జంట సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాలలోని ప్రధాన రోడ్లతో పాటు, వీధుల్లోని రోడ్లు జలమయమయ్యాయి. దీంతో ప్రయాణికులు,స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఐడిపిఎల్ కాలనీ నుండి జగద్గిరిగుట్ట వెళ్లే ప్రధాన రహదారి రంగారెడ్డినగర్ వివేకానంద విగ్రహ కూడలి వద్ద వర్షపు నీరు అర కిలోమీటర్ మేరకు స్తంభించి పోవడంతో ప్రయాణికులు, పాదాచారులు నరకయాతన అనుభవిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. వాహనాలు వేగంగా వెళ్లే క్రమంలో వర్షపు నీరు పాదాచారుల మీద పడుతుండడంతో ఘర్షణలు కూడా చోటుచేసుకుంటున్నాయి. గాజుల రామరం డివిజన్ పరిధిలోని లోతట్టు ప్రాంతాలు పక్షికంగా జరమయమయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ముంపు ప్రాంతాలలో ఎప్పటికప్పుడు పర్యటించి, తగిన చర్యలు చేపట్టాలని పలు ప్రాంతాల వాసులు కోరుతున్నారు.



గిరినగర్‌లోని ప్రాంతంలో గుంతల మాయంగా వర్షపు నీటితో అధ్వానంగా మారిన ప్రధాన రోడ్డు..

ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తా



- వడ్డేపల్లి రాజేశ్వర్ రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

పదవిలో ఉన్న లేకున్నా, అధికారంలో ఉన్న లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా కీర్తి శేషులు వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయ సాధనకై పనిచేస్తానని వడ్డేపల్లి రాజేశ్వర్ రావు తెలిపారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రనగర్ బస్తీ వాసుల నీటి కష్టాలను తీర్చేందుకు, గత నెల ఆగస్టు 30వ తేదిన ఇంద్రానగర్ సంక్షేమ సంఘం వారి కోరిక మేరకు..బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, ఇంద్రనగర్ హనుమాన్ ఆలయ ప్రాంగణంలో వాటర్ బోర్ వేయించారు. నీటి సమస్యపై వెంటనే స్పందించి నిర్ణయం తీసుకున్నందుకు అలాగే వాటర్ బోర్ విజయవంతం అవడంతో.. ఇంద్రనగర్ బస్తీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ, వడ్డేపల్లి రాజేశ్వరరావు నివాసానికి వచ్చి ధన్యవాదాలు తెలియజేసి, సన్మానించారు. అనంతరం వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ పదవిలో ఉన్న లేకున్నా, అధికారంలో ఉన్న లేకున్నా ప్రజా సేవే లక్ష్యంగా కీర్తి శేషులు తండ్రి వడ్డేపల్లి నర్సింగ్ రావు ఆశయ సాధనకై పనిచేస్తా అని తెలియజేశారు. అలాగే ఇంద్ర నగర్ బస్తీ వాసులో మరికొన్ని సమస్యలను నా దృష్టికి తీసుకురావడం జరిగిందని వాటిని కూడ తొందరలోనే పరిష్కరిస్తానని, బస్తీవాసులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు గిరి సాగర్, ప్రధాన కార్యదర్శి ఎం.అర్జున్, కోశాధికారి రాజు, సభ్యులు రవి సాగర్, నాగరాజు, అనిల్, బస్తీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్‌లో పర్యటించిన ఎమ్మెల్యే కార్పొరేటర్



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో.. ఆల్విన్ కాలని డివిజన్ పరిధిలోని, వర్ష ప్రభావిత ప్రాంతాలైన ఆల్విన్ కాలనీ ఫేస్ 2, ధరణి నగర్, షిరిడి నగర్, ఎల్లమ్మబండ, అంబెడ్కర్ నగర్ మరియు అంబిర్ చెరువు పరిసర ప్రాంతాలలో, శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరేకపూడి గాంధీ, స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్‌తో కలిసి, పర్యటించారు. భారీ వర్షం కారణంగా.. ముంపుకు గురైన మరియు విరిగిపడిన భారీ వృక్షాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మెరకు అప్రమత్తంగా ఉండలని అన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రజలు, ప్రతి కాలనీ వాసులు, తమ ఇండ్ల నుంచి ఎవరు బయటకి రావొద్దు అని అన్నారు. ఎటువంటి ఇబ్బందులు కలిగిన,(ఎలక్ట్రికల్, రోడ్లు, డ్రయినేజీ, మంచి నీటి) వంటి సమస్యలు ఎదురైన, వెంటనే సంబంధిత అధికారులకు గానీ, తమ కార్యాలయంలో గానీ సంప్రదించాలని తెలియచేసారు. అదేవిధంగా వర్షాలను దృష్టిలో పెట్టుకొని, లోతట్టు ప్రాంతాల పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని... జీహెచ్ఎంసీ అధికారులు, మాన్ సున్ ఎమర్జెన్సీ టీమ్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సిబ్బంది, ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉంటూ, ఎటువంటి ఇబ్బంది లేకుండ చూడాలని అన్నారు. అధికారులు గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని లోతట్టు ప్రాంతాలు, నీరు నిల్వ ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా వర్షకాలంను దృష్టిలో పెట్టుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, కాలనీ వాసులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నందికంటి శ్రీధర్ జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాష్ట్ర ఎంబీసీ డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, బీఆర్ఎస్ నాయకులు నందికంటి శ్రీధర్ పుట్టినరోజు వేడుకలను మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ ఉప్పర్ గూడలోని వాత్సల్య సింధు నిరాశ్రిత బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నందికంటి శ్రీధర్ రానున్న కాలంలో మరిన్ని ఉన్నతమైన పదవులు చేపట్టాలని, ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, గుత్తి రామచందర్, వంశీ, శ్రీనివాస్ యాదవ్, వాసు, భాగ్యానందరావు, శ్యామ్, రాములు, విఠల్, కిరణ్, సతీష్, సూర్యప్రకాష్, రుక్మత్, హబీబ్, ఉదయ బాబు, నాగరాజుగౌడ్, అన్నమ్మ, నవనీత, లలిత, స్వరూప, లీనా, విజయలక్ష్మి, పాల్గొన్నారు.

ఎరయా ఫర్టిలిటీ సెంటర్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఎరయా ఫర్టిలిటీ హైదరాబాద్‌లో తన కొత్త అత్యాధునిక ఐవీఎఫ్ సెంటర్‌ను ప్రారంభించింది. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఎరయా ఫర్టిలిటీ డైరెక్టర్ డాక్టర్ ఐశ్వర్య నుపూర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఐశ్వర్య మాట్లాడుతూ 'ఎరయా ఫర్టిలిటీ రోగులకు అత్యుత్తమ నాణ్యతైన సంరక్షణ, చికిత్సను అందించడానికి కట్టుబడి ఉంది. ప్రపంచ స్థాయి ఫర్టిలిటీ సంరక్షణను అందరికీ అందుబాటులోకి తీసుకొచ్చాం. మా కొత్త సౌకర్యం అత్యాధునిక సాంకేతికతతో కూడుకున్నది. నిరంతరం కృషి చేసే నిపుణుల బృందం, ఫర్టిలిటీ సర్టిఫైడ్ నర్సులు, ఎంబ్రియాలజిస్టులు, మానసిక, జన్యుపరిశీలన కౌన్సిలర్‌లతో పని చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పి.కాళీ ప్రసాద్ రావు, తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా జగ్గారెడ్డిని కలిసిన ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

తెలంగాణ రాష్ట్ర టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మెన్ నిర్మలా జగ్గారెడ్డిని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన ఇండస్ట్రియల్ ఏరియాలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. సానుకూలంగా స్పందించిన నిర్మలా జగ్గారెడ్డి తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. త్వరలోనే ఉప్పల్, చర్లపల్లి, నాచారం, మల్లాపూర్, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఏరియాలో త్వరలోనే పర్యటిస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, సాయిజెన్ శేఖర్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి



- సీపీఐ(ఎం) డిమాండ్

నవతెలంగాణ-కాప్రా

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని సీపీఐ(ఎం) పార్టీ కాప్రా సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ కాప్రా మున్సిపల్ ఆఫీస్ దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) కాప్రా సర్కిల్ కార్యదర్శి జి. శ్రీనివాసులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇంకేమీ అమలు కావట్లేదన్నారు. ఆరు గ్యారెంటీలలో జీరో కరెంటు బిల్లు కొద్దిమందికి మాత్రమే వస్తుందని, ఇంకా చాలామందికి రావటం లేదని తెలిపారు. రూ. 500 వంట గ్యాస్ సిలిండర్ ఇస్తామన్న హామీ ఏ ఒక్కరికీ రావడం లేదన్నారు. ఆసరా పింఛన్లు పెంచి ఇస్తామన్న రూ.4016 అమలు కావడం లేదని పేర్కొన్నారు. దివ్యాంగులకు రూ. రూ.6016 ఇవ్వడం లేదని చెప్పారు. అర్హత కలిగిన వారందరికీ కొత్త పింఛన్లు ఇస్తామని చెప్పి దాని ఊసే ఎత్తడం లేదన్నారు. గృహలక్ష్మి పథకం కింద మహిళలకు రూ.2500 ప్రతినెలా ఇస్తామని మోసం చేస్తోందన్నారు. ఎన్నికలలో లబ్ధి పొందేందుకు మాత్రమే ఆరు గ్యారంటీలను ప్రకటించారని, అందులో రెండు మాత్రమే అమలు చేస్తున్నారని, మిగతావి గాలికి వదిలేశారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన వారికి ఇవ్వాలన్నారు. ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. ప్రభుత్వ పథకాల కోసం ప్రజలు పనులు వదిలిపెట్టుకొని వార్డు ఆఫీసుల చుట్టు, జీహెచ్ఎంసీ కార్యాలయాల చుట్టు తిరుగుతున్నారని వాపోయారు. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్‌కు మెమోరండం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ కమిటీ సభ్యులు సిహెచ్ ప్రసాద్, కేవీ చారీ, శివన్నారాయణ, వెంకట్, సఫియా, నాయకులు యమ్.ఎస్ రావు,జీవీ రావు,లక్ష్మి నారాయణ, సుభాషిణి, లావణ్య, వినోద, కళ, లక్ష్మి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

బోనం తెలంగాణ సంస్కృతిలో భాగం



- బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ నర్సింహ రెడ్డి
- అత్యంత భక్తి శ్రద్ధలతో బోనాల పండుగ

నవతెలంగాణ-హైదరాబాద్‌డెస్క్

హస్తినాపురం డివిజన్ పరిధిలోని ఓంకార్ నగర్ బస్టాప్ వద్ద ఆర్య వైశ్య సంఘం ప్రతినిధుల నేతృత్వంలో సోమవారం అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంఘం నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున తమ సంఘం నుండి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, సుమారుగా 600ల మందికి అన్నదాన వితరణ చేశామన్నారు. రానున్న రోజుల్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక, సేవా కార్యక్రమాలను చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హస్తినాపురం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధు సుదన్ గుప్తా, కార్యదర్శి బిజ్జల వేణు గుప్తా, ట్రెజరర్ బండారు సుధాకర్ గుప్తా, గౌరవ అధ్యక్షుడు కాసుల శ్రీనివాసులు గుప్తా, ఉపాధ్యక్షుడు శివ యాదగిరి గుప్తా, సంయుక్త కార్యదర్శి ఎర్రం భాస్కర్ గుప్తా, వై. రవీందర్ గుప్తా,కే. గణేష్, ఎం. రాజు, సి.హెచ్ గణేష్, ఎస్.మధు, వెంకటేశ్వర్లు,శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

జంట జలాశయాలకు చేరుతున్న వరద నీరు

- **గండిపేటను సందర్శించిన జలమండలి ఈడీ**



నవతెలంగాణ-సిటీబ్యూరో

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నగరంలో ఉస్మాన్‌సాగ్, హిమయత్ సాగర్ జంట జలాశయాలకు వరద నీరు పొటెత్తుతోంది. ఉస్మాన్ సాగర్ ఎఫ్‌టీఎల్ లెవల్ 1790 ఫీట్లుకాగా, ప్రస్తుతం 1784 ఫీట్లు నీరు వచ్చింది. హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్ లెవల్ 1763.50 ఫీట్లుకాగా, ప్రస్తుతం 1759.30 ప్రాజెక్టులో నీరు నిల్వఉంది. ఇదిలావుండగా ఉస్మాన్ సాగర్ జలాశయాన్ని జలమండలి ఈడీ మయాంక్ మిట్టల్ సోమవారం నాడు సందర్శించారు. ఈ సందర్భంగా ఈడీ జలాశయం గురించి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంద సంవత్సరాల చరిత్ర కలిగిన మానవ నిర్మిత కట్టడమని, దీని గేట్లు ఆటోమేషన్‌లో కాకుండా ఇప్పటికీ మ్యాన్యువల్ పద్దతిలోనే నిర్వహిస్తామని అధికారులు వివరిం చారు. అలాగే ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో జలాశయంలోకి ఇన్ ఫ్లో వివరాలతో పాటు అక్కడి ప్రస్తుత పరిస్థితిని ఈడీ అడిగి తెలుసున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఈడీ మయాంక్ మిట్టల్ సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంకతో పాటు జలమండలి సీజీఎం రవీందర్ రెడ్డి, జీఎం డేవిడ్ రాజ్, రెవిన్యూ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్**



నవతెలంగాణ, బడంగ్‌పేట్

భారీ వర్షాలకు ప్రజలు లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ అన్నారు. సోమవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న ఉస్మాన్ నగర్ కాలనీలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ ఉస్మాన్ నగర్‌లోని లోతట్టు ప్రాంతాలన్నీ సందర్శించారు. వరుద నీటిలో ముంపుకు గురైన అక్కడ ఉన్న 6 ఇళ్ల వారిని తక్షణమే అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించి ఇక్కడ మెడికల్ కెంపును నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.అనంతరం బాలాపూర్ గణేషుని ఊరేగింపు జరిగే రోడ్డు మార్గాన్ని అందుకోసం చేస్తునటువంటి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు. అక్కడ బాలాపూర్ నుండి చాంద్రాయణ గుట్ట వరకు నిర్మాణం చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను 2 నుండి 3 రోజుల్లోగా పూర్తి చేసి వీధి దిపాలను ఏర్పాటు చేయుటకు శానిటేషన్ నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీపి మహేశ్వరం లక్ష్మీకాంత్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ మజర్ అలీ, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ వాణి రెడ్డి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అయేషా, ఇరిగేషన్ ఏఈ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన పార్కును కాపాడాలి

నవతెలంగాణ, బడంగ్‌పేట్



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాలాపూర్ గ్రామంలోని 18వ డివిజన్ పరిధిలో ఉన్న విజయ కాలనీలో ఉన్న సర్వే నెంబర్ 75/1లోని 2200 గజాల పార్కు స్థలాన్ని గ్రామానికి చెం దిన కొందరు రాజకీయ నాయకులు నకిలీ డాక్యుమెంట్లను తయారు చేసి ఆక్రమణకు గురి చేస్తున్నారని ఆ పార్కు స్థలాన్ని కాపాడాలని కోరుతూ సోమవారం కాంటేస్టెడ్ కార్పొరేటర్ తిమ్మని గిరీష్, ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి బోర్ర రవి,నాయకులు సుధాకర్, శ్రీరాములు, పి. ఉమేష్ లు కలసి కమిషనర్ రఘుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాపూర్ గ్రామానికి చెందిన కొందరు రాజకీయ నాయకులు ఈ పార్కు స్థలంపై కన్ను వేసి 25సంవత్సరాల క్రితం చేసిన లే అవుట్ ను ఓపెన్ ప్లేస్ గా ఉన్న ఈ స్థలాన్ని పక్కన ఉన్న ప్లాట్ల బై నెంబర్లతో 10 డాక్యుమెంట్లను తయారు చేసి 2200గజాల స్థలం స్థలంను మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల సహకారంతో యద్దెచ్ఛగా కబ్జాకు పాలుపాడుతున్నారని తెలిపారు. అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటూ ప్రహరీ గోడ నిర్మాణం చేయటం జరుగుతుందన్నారు. మున్సిపల్ అధికారులు మాత్రం మాకు ఏమి తెలియదనట్లుగా ప్రేక్షక పాత్రగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పేదలు 60గజాల స్థలం అక్రమిస్తే వాటిపై అధికారులు కూల్చి వేసి హంగామా చేస్తారని, ఈ భూ కబ్జాలకు పాలు పడితే పట్టిపతనట్లుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఆ స్థలంలో షెడ్లు వేసి ఇండ్లు నిర్మాణం చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదన్నారు. వందల కోట్ల రూపాయల విలువ చేసే పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్న వ్యక్తులపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు.ఆ స్థలాన్ని కాపాడి ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాలని కోరారు.

వృద్ధుడి అదృశ్యం

నవతెలంగాణ-నాగోల్



75 సంవత్సరాల వృద్ధుడు అదృశ్యమైన సంఘటన నాగోల్ పోలీస్‌స్టేషన్ పరిధిల చోటు చేసుకుంది. నాగోల్ పోలీస్ స్టేషన్ ఎస్సై శివ నాగ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం .. నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగోల్ డివిజన్ జైపూర్ కాలనీ, రాజ్యలక్ష్మి నగర్ కాలనీ రోడ్డు నెంబర్ నాలుగులో నివాసం ఉంటున్న పరవస్తు కృష్ణ అనే వృద్ధుడు శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని అతని వద్ద ఫోను సౌకర్యం కూడా లేకపోవడంతో సమాచారాన్ని కనుక్కోలేకపోయామని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ కోసం బంధుమిత్రుల వద్ద విచారించడం ఫలితం లేకపోయిందని దీంతో పక్ష వాతంతో ఉన్న మా నాన్న మాట్లాడలేడని దీంతో మా నాన్న ఆచూకీ కనుక్కొని తమకు న్యాయం చేయాలని బాధితుని కుమారుడు పరవస్తు ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శివ నాగ ప్రసాద్ తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-హాయత్ నగర్

హయత్ నగర్ పబ్లిక్ స్కూల్లో 2009-10 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ ప్రాంతాల్లో, వివిధ హోదాల్లో స్థిరపడిన మేమంతా ఒకచోట చేరుకొని గత అనుభవాలు, జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. 14 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారు రోజంతా ఆటపాటలతో ఎంతో సంతోషంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పారంద సాయి ప్రసాద్, సద్దిపెళ్లి శివా రెడ్డి, అంతటి భారత్, మాధురి, చైత్యన ముదిరాజ్, విజయ్ గౌడ్, సంఘీ మౌనిక, హర్షద్, శిరీష, మూలుగు రాజేష్, శ్రీనివాస్ రెడ్డి, రూబీ, బండారి సాయి, సోనీ, నరేష్, సురేష్, హరి కిరణ్, ఇర్ఫాన్, క్రాంతి కుమార్, వినోద్, మహేష్, అస్మత్, చంద్ర రెడ్డి, ఆర భరత్, సతీష్, అబ్దుల్ రూఫ్,బాలాజీ,సుధీర్ పాల్గొన్నారు.

వినాయక చవితి ఏర్పాట్లపై సమీక్ష

నవతెలంగాణ-ఎల్ బి నగర్



ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ ఆధ్వర్యంలో డివిజన్ కార్పొరేటర్స్‌తో, జీహెచ్ఎంసీ అధికారులు, భాగ్యనగర్ సమితి సభ్యులతో రానున్న వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్కిల్ పరిధిలో ఉన్న ప్రధాన రహదారిలో గణపతి విగ్రహం నిమగ్న సమయంలో ఎలాంటి ఆటంకాలు కలగకుండా రోడ్లను మరమ్మత్తులను నిర్వహించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. చెట్లు కొమ్మలు ట్రిమ్మింగ్ చేయించి వాటిని వెంటనే తొలగించాలని అధికారులను కోరారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగే విదంగా చర్యలు తీసుకోవాలని ఎలక్ట్రికల్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా వినాయక మండపాలు వద్ద చెరువుల వద్ద, బేబీ పాండ్ల వద్ద రోజువారీగా వెంట వెంటనే చెత్తను తొలగించేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి తెలిపారు. ప్రతి వినాయక మండపం పరిసర ప్రాంతాల్లో యాంటీ లార్వాలు ఆపరేషన్, ఫాగింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ఏంటమాలిస్ట్ అధికారులు ఆదేశించారు. వినాయక నిమజ్జనం కార్యక్రమాల ను ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్, ట్రాఫిక్ అధికారులు కోరారు. హైదరాబాద్ మెట్రో వాటర్ వర్కర్స్ అధికారులు నిమగ్నం ప్రాంతాల్లో మంచినీరు సరఫరా చేయాలని ఆదేశించారు. టీఎస్ఎస్ పీడీసీ ఎల్ అధికారులను నిరంతర కరెంటు అందించాలని కోరారు. అడ్డుగా ఉన్న కరెంటు వైర్లను తొలగించాలని కోరడం జరిగింది. వినాయక మండపాల్లో ఉన్న పూజా సామాగ్రిని తరలించేందుకు ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో హస్తినా పురం కార్పొరేటర్ బానోతు సుజాత, చంపాపేట్ కార్పొరేటర్ వంగ మధుసూదన్ రెడ్డి, లింగోజిగూడ కార్పొరేటర్ రాజశేఖర్ రెడ్డి, జిహెచ్ఎంసి అధికారు లు, భాగ్యనగర్ సమితి ఉత్సవ సభ్యులు చిల్వేరు అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలి

- **రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్**



నవతెలంగాణ, బడంగ్ పేట్

రానున్న గణేష్ నవరాత్రులను పురస్కరించుకొని బాలాపూర్ నుండీ చాంద్రాయణగుట్ట వరకు నూతనంగా నిర్మాణం చేయనున్న రోడ్డు పనులను రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డితో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని బాలా పూర్ నుండి చాంద్రాయణగుట్ట వరకు ఉన్న రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారిందని, గణేష్ నవరాత్రి ఉత్సవాలు పూర్తి అయ్యే వరకు రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్, జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ రఘు, వాణిరెడ్డి, బీఎంసి ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటరు పెద్దభావి సుదర్శన్ రెడ్డి ఉత్సవ కమిటీ చైర్మన్ కళ్లెం నిరంజన్ రెడ్డి, టేకుల శశిధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తుల్ల నరహరి గౌడ్, ఉత్సవ కమిటి సభ్యులు,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉస్మాన్ నగర్ ముంపు ప్రాంత ప్రజలను ఆదుకుంటాం

- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



నవతెలంగాణ-బడంగ్ పేట్

మూడు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జల్ పల్లి మునిసిపాలిటీలోని ఉస్మాన్ నగర్‌లో స్థానిక చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాది, కమిషనర్ వాణిరెడ్డి, నాయకులు, కార్యకర్తలతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలో ఉన్న సమయంలో జల్‌పల్లి మున్సిపాలిటీ అభివద్ధి కోసం ప్రత్యేక నిధులు గతంలో రూ.50 కోట్లు మంజూరు చేశారని, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అట్టి నిధులను అడ్డుకోవడం వల్ల ఈ దుస్థితి జల్‌పల్లి మున్సిపాలిటీలో ఏర్పడిందన్నారు. తక్షణమే మహేశ్వరం నియోజకవర్గానికి స్పెషల్ ఫండ్ త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ ప్రాంతంలో తక్షణమే ఒక మెడికల్ క్యాంపును కూడా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలకు పిల్లలు, వృద్ధులు ఎవరూ బయటకు రావద్దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ చైర్మెన్ అబ్దుల్లా సాది, మున్సిపల్ కమిషనర్ వాణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఖైసర్ బాం, కౌన్సిలర్ యాహియా, డీఈఈ వెంకన్న, ఏఈ అయేషా, కౌన్సిలర్లు కో ఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నెలలోపు 72 కుటుంబాలకు డబుల్ ఇండ్లు

- **హామీ ఇచ్చిన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దూరిశెట్టి**



నవతెలంగాణ-చంపాపేట్

బండ్లగూడ మండలం జంగంమేట్ ఎంహెచ్‌సీ క్వార్టర్స్‌లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను 72 కుటుంబాలకు నెలలోపు అలాట్మెంట్ చేస్తామని హైదరా బాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం సీపీఐ(ఎం) నాయకులు కలెక్టర్‌ను కలిసి 72 కుటుంబాలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇవ్వాలని కోరారు. పార్టీ డివిజన్ కార్యదర్శి కష్ణ నాయక్ మాట్లాడుతూ.... పేదలు నివాసం ఉన్న స్థలాన్ని తీసుకొని డబుల్ బెడ్ రూమ్ ఇల్లు 16 నెలలో కట్టిస్తాం అని ఆశ కలిగించి 10సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటికి అధికారులు చుట్టూ తిప్పుతున్న పరిస్థితి ఉందన్నారు. కనీసం ఇప్పటికైనా అలాట్మెంట్ చేసి పేదలకు న్యాయం చేయాలని కోరగా అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందిం చారు. నెల లోపు 72 కుటుంబాలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అలాట్మెంట్ చేస్తామని చెప్పారు. గతంలో అధికారులు నిర్లక్ష్యం వల్ల పేద ప్రజలకు అన్యాయం జరిగిందని ఇప్పటికైనా న్యాయం చేసే విధంగా జిల్లా కలెక్టర్ చూడాలని పార్టీ నాయకులు తెలియజేశారు. పార్టీ జిల్లా నాయకులు కిషన్, రామ్ కుమార్, శ్రీను, బాధితులు సంగీత, పర్వతమ్మ రేణుక, పద్మ, సువర్ణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ సీఎం వైఎస్ఆర్ వర్ధంతి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం వైఎస్ఆర్ సేవలు మరువలేనివి

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి.



నవతెలంగాణ-బడంగ్ పేట్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు మరువలేనివని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గుడలోని వైఎస్ఆర్ పార్కు వద్ద ఉన్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పేదల పెన్నిధి జననేత చేసిన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు, అను బంధ సంఘాల నాయకులు కార్యకర్తలు, వైయస్సార్ అభిమానులు వైఎస్ఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి,పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నవ్వారు మలారెడ్డి, నాయకులు ప్రతాప్ రెడ్డి, సూర్జగంటి విజయ్, హరి గౌడ్, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-బడంగ్ పేట్

బాలాపూర్‌లో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని పురస్కరించి బాలాపూర్ లో జరిగిన కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎంసి ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి కార్పొరేటర్లు బండారి మనోహర్, ఎర్ర మహేశ్వరి జైహింద్, నాయకులు టేకుల శశిధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, తుల్ల నరహరి గౌడ్, గొరిగె శ్రీశైలం, ఎక్కే శ్రీను, నీరుడు శ్రీరాములు, ఆనంద్, మేకల సంజీవ, బొనగిరి శ్రీను, వంగేట్ కొండల్ రెడ్డి, ఉమేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-హాయత్ నగర్



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఎల్.బి నగర్ నియోజకవర్గం కామినేని చౌరస్తాలో వైయస్సార్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించిన ఎల్. బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి, టీపీసీసీ ప్రతినిధి జక్కిడి ప్రభాకర్ రెడ్డి తదనంతరం ఆయన మాట్లాడుతూ మహానేత వైయస్సార్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిత్యం ప్రజల సంక్షేమ అభివృద్ధి కొరకు పాటు పడేవారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి ఎర్రం బెల్లి సతీష్ రెడ్డి, కోలన్ సుధాకర్ గౌడ్, జైపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు పృథ్వీరాజ్, నరసింహారావు, శ్యామల్ రెడ్డి, శంకరయ్య, విటల్ రెడ్డి, రాజశేఖర్, గిరిజన నాయకులు గాంధీ నాయక్, బుంగరాజు అశోక్, అజయ్,అక్రమ్,సతీష్ మహిళా నాయకులు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

5న డాక్టర్ రాము కవితా సంపుటి 'మధురోహాలు' ఆవిష్కరణ

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 5 వ తేదీన ప్రఖ్యాత కవి డాక్టర్ ఎం. కె.రాము రచించిన ' మధురోహలు ' కవితా సంపుటి ఆవిష్కరణ సభ రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సేవా సంస్థ రసమయి నిర్వహణ లో జరుగనున్నది. ముఖ్య అతిథిగా అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఏం రమేష్ కుమార్ పాల్గొంటారని, సివిల్ సర్వీస్ విశ్రాంత ఉన్నత అధికారి డాక్టర్ కె వి రమణ సంపుటిని ఆవిష్కరిస్తారని నిర్వాహకులు తెలిపారు. హై కోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్ర కుమార్ అధ్యక్షత వహించే సభలో ఆదాయపు పన్నుల శాఖ విశ్రాంత ముఖ్య కమిషనర్ నరసింహప్ప కు కవితా సంపుటిని అకింత మిస్తారున్నారు. అతిథులు గా ఆచార్య ఎల్లూరి శివా రెడ్డి స్వర కర్త సాయి బాబా పాల్గొంటారు. డాక్టర్ రాము రచించిన లలిత గీతలను రామా చారి సురేఖ, విజయ లిటిల్ మ్యూజిషన్ అకాడమీ బాల బాలికలు గానం చేస్తారు

నిమ్స్‌లో బ్లడ్ డొనేషన్ క్యాంప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

నిమ్స్ బ్లడ్ బ్యాంక్ హెచ్‌ఓడీ డాక్టర్ శాంతి ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవా సంస్థలైన తెలుగు మొమ్స్ నెట్‌వర్క్, జేసీఐ హైదరాబాద్ మైత్రి, సహజ ఫౌండేషన్, ఏక్ కథం ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో ఈ నెల నుంచి 12వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు రక్తదాన సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుధీర్, డాక్టర్ మహేష్, డాక్టర్ మురళి, శేఖర్, పీజీ విద్యార్థులు, టెక్నికల్ సిబ్బంది, నర్సింగ్ సిబ్బంది, సోషల్ సర్వీస్ సంస్థల అధ్యక్షులు ప్రదీప్తి, శైలజ, అమిత్ శర్మ, బ్రింద, దిలీప్, కో-ఆర్డినేటర్ సత్యసుధ పాల్గొన్నారు.



హెల్త్ కేర్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

రసూల్ పురలో కే ఎస్ ఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆర్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన హెల్త్ కేర్ సెంటర్‌ను సోమవారం ఎమ్మెల్యే శ్రీ గణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి హెల్త్ కేర్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హెల్త్ కేర్ సెంటర్లు కూడా పేదల కోసం పనిచేయాలని కోరారు. ధనాపేక్ష లేకుండా నామమాత్రపు రుసుము తో పని చేస్తే ప్రజల ఆదరణ పొందుతారని చెప్పారు కార్యక్రమంలో ఐపీఎస్ అధికారులు సుమతీ హూడ, నయీమ్, అష్రఫ్, నగేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం ప్రారంభించిన ఎమ్మెల్యే

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం బోయిన్‌పల్లి శ్రీ కట్ట మైసమ్మ దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకుముందు అమ్మ వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాజుల క్రాంతి, జాజుల సాయి, సత్యనారాయణ, వెంకటాచారి, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు



బస్తీ వాసులకు ఆహార పంపిణీ

నవతెలంగాణ-బేగంపేట

ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు భారీ వర్షాల వల్ల ప్రభావితమైన రెండు ప్రాంతాలైన దాసరం బస్తీ, అల్లాదిన్ కోటి బస్తీలలో కాంగ్రెస్ సనత్ నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమ సోమవారం ఆహార పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడిసెలలో నివసిస్తున్న పేద కుటుంబాలకు అవసరమైన ఆహార సరఫరాలను అందించి వారికి ఉపశమనాన్ని కలిగించారు. విపత్తులో నష్టపోయిన వారిని ఆదుకోవడానికి తన నిబద్ధతను వ్యక్తంచేస్తూ ఈ కష్ట సమయాల్లో అత్యంత బలహీనంగా ఉన్నవారికి సహాయం చేయడానికి సమాజంలోని అన్ని వర్గాల నుండి సంఘీభావం, సహాయాన్ని కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లీడర్లు కమల్ రాజ్, రమేశ్, ఐవాన్, అడ్డూ, అతిక్ మొహసిన్, ఎస్ఎస్ రావు, ఎస్ఎస్ రెడ్డి, కృష్ణ యాదవ్, రాజేశ్వరి, రజనీకాంత్, సోఫియా, ఖమర్, విజయ, అశ్విని, విజయలక్ష్మి, పద్మావతి, జహంగీర్, అజీమ్, మస్తాన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



రిదా రేడియన్స్ స్కిన్ హెయిర్ క్లినిక్ ప్రారంభం

నవతెలంగాణ-బంజారాహిల్స్

సినీ సెలబ్రిటీలు మాత్రమే కాదని ప్రస్తుత సోషల్ యుగంలో ప్రతి ఒక్కరూ తమ అందాలను మెరుగులు దిద్దుకునేందుకు రకరకాల ప్రయోగాలు చేస్తూనే ఉన్నారని సినీ నటి అనన్య నాగళ్ళ అన్నారు. సోమవారం నగరంలో నూతనంగా ఏర్పాటు చేసిన రిదా రేడియన్స్ స్కిన్ హెయిర్ క్లినిక్‌ను అతిథిగా హాజరైన ఆమె ప్రముఖ యాంకర్ సునైన,నటుడు రాజేష్‌లతో కలిసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఒకప్పుడు అందానికి అడ్వాన్స్‌డ్ ట్రీట్‌మెంట్లు కావాలంటే ముంబై, బెంగళూరు, ఢిల్లీ నగరాలకు వెళ్ళేవారని కానీ ఇప్పుడు హైదరాబాద్‌లోనే అంతర్జాతీయ స్థాయి చికిత్సలు అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్‌తో పాటు పలు ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న చాలా మంది ఇప్పుడు సినీ సెలబ్రిటీలకు ధీటుగా రీల్స్ చేస్తూ ఆకట్టుకుంటున్నారని వారందరూ మరింత అందంగా కనిపించేందుకు స్కిన్ క్లినిక్‌లకు బారులు తీరుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రిదా రేడియన్స్ సీఈవో సయ్యద్ కరిష్మా,డాక్టర్ శతి,సీమాఖాన్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం నిర్వహించిన ప్రతాప్

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బాపూజీ నగర్ శ్రీ దేవి నల్ల పోచమ్మ, చిన్న తోకట్టలోని కట్ట మైసమ్మ ఆలయాల్లో సోమవారం అమ్మవారికి కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ప్రతి అమావాస్య రోజు ఆలయంలో అన్నదానం చేయడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు.కార్యక్రమంలో ప్రకాష్ భాటియా, ఆలయ కమిటీ సభ్యులు అజిత్,ప్రేమ్ ముదిరాజ్, రామారావు, నరసింహ, నరేందర్, శ్రీకాంత్, క్రాంతి, విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించండి

- క్వాలిటీ కంట్రోల్ బృందాలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గ్రేటర్ పరిధిలో తాగునీరు సరఫరాలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దాన కిషోర్ జలమండలి అధికారులకు సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో సోమవారం సాయంత్రం మాసబ్ ట్యాంక్‌లోని టీయూఎఫ్‌ఐడీసీ కార్యాలయంలో జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, ఈడి మయాంక్ మిట్టల్, ఉన్నతాధికారులతో తాగునీరు సరఫరాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సీవరేజ్ , తాగునీరు సరఫరాలో ఎదురయ్యే సమస్యలను దూరం చేసేందుకు జీఎం, డీజీఎం, మేనేజర్‌లు, ఇతర సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. వర్షాల వల్ల తాగునీరు కలుషితం అయ్యే అవకాశం ఉన్నందున నీటిని సేకరించింది మొదలు వినియోగదారులకు సరఫరా చేసే వరకు నిల్వ చేయడం, శుద్ధి ప్రక్రియ, క్లోరినేషన్, పంపింగ్, ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్‌పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో జలమండలి అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వాటర్‌లాగింగ్ పాయింట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముంపు ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. సాధ్యమైన ప్రాంతాల్లో క్లోరిన్ బిల్లలు పంపిణీ చేయాలని, కలుషిత నీరు సరఫరా అయ్యే ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాన్‌హెూల్స్ తెరవకుండా చూడాలన్నారు. కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ప్రజా ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని చెప్పారు.

నేడు ఓయూలో ప్రో.కోదండరాంకు సత్కారం

నవతెలంగాణ-ఓయూ

ఓయూలో సుదీర్ఘకాలం అధ్యాపకులుగా కొనసాగి, పదవీ విరమణ పొంది, తెలంగాణ రాజకీయాల్లో అత్యంత చురుకైన పాత్ర పోషించి, తెలంగాణ ఉద్యమానికి రథసారథిగా ముందుండి పోరాడిన ప్రొ. కోదండరాంకు కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ ఆధ్వర్యంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఇటీవల గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా వారిని సన్మానించుకోవటం కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బాధ్యతగా తాము భావిస్తున్నట్టు నేతలు డా.ధర్మతేజ , డా.వి.కుమార్ లు తెలిపారు. మధ్యాహ్నం 1 గంటకు, ఆర్ట్స్ కళాశాల వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్ట్ అధ్యాపకులంతా పెద్ద సంఖ్యలో చేరుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జాబ్ సెక్యూరిటీతో కూడిన బేసిక్ ప్లస్ డీఏ ప్లస్ హెచ్‌ఆర్ఏ కావాలనుకునే ప్రతి అధ్యాపకులు ఈ కార్యక్రమానికి రావాలని కోరారు.

ఓయూ మెస్‌లలో చీఫ్ వార్డెన్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ

భారీ వర్షాల కారణంగా ఓయూహాస్టల్స్, మెస్సలలో ఎటువంటి సమస్యలు లేకుండా విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలని కేర్ టేకర్‌లతో చీఫ్ వార్డెన్ డా. కొర్రెముల శ్రీనివాస్ సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. హాస్టల్‌లో వర్షాల వల్ల విద్యార్థులకు ఎటువంటి సమస్యలు లేకుండా అందరూ అందుబాటులో ఉండాలని సూచిస్తూ , ఏమైన సమస్యలుంటే తమ దృష్టి కి తీసుకరావాలన్నారు. అనంతరం హాస్టల్స్ , మెస్‌లను సందర్శించి పలు సూచనలు చేస్తూ విద్యార్థులతో మాట్లాడారు.



17న సామూహిక వినాయక నిమజ్జన కార్యక్రమం

- భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి..

నవతెలంగాణ-బంజారాహిల్స్

వినాయక విగ్రహ సామూహిక నిమజ్జన కార్యక్రమాన్ని ఈ నెల 17న నిర్వహించనున్నట్టు భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి తెలిపింది.సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్ష కార్యదర్శులు రాఘవరెడ్డి,శశిధర్లు మాట్లాడారు. భాగ్యనగర్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో 48వ మహా నిమజ్జన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈనెల 7న ప్రారంభం కానున్న వినాయక ఉత్సవాలు 17తో ముగుస్తుండడంతో అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసినట్టు చెప్పారు. ప్రభుత్వంలోని 18 శాఖల సమన్వయంతో ఈ ఏడాది నిమజ్జన కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.గణేష్ ఉత్సవాలకు ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వ ముందుకు రావడం హర్షనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి మహేందర్ రెడ్డి,అడ్వైజర్ కరోడి మాల్జి,తదితరాలు పాల్గొన్నారు.

కేబుళ్లను దొంగలిస్తున్న ముఠా అరెస్ట్



- నిందితుల వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 120 కేజీల కాపర్ వైరు స్వాధీనం

నవతెలంగాణ-బేగంపేట్

బీఎస్ఎన్ఎల్ అండర్ గ్రౌండ్ కమ్యూనికేషన్ కాపర్ వైరును దొంగిలిస్తున్న 14 మంది ముఠా సభ్యులను, దొంగిలించిన కాపర్ వైర్లను కొంటున్న మరో ఇద్దరు రిసీవర్లను బోయిన్పల్లి పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సుమారు రూ.10 లక్షల విలువైన 120 కిలోల కాపర్ వైర్లను, దొంగతనానికి ఉపయోగించిన ఆటో, రెండు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం సికింద్రాబాద్ నార్త్ జోన్ డీసీపీ కార్యాలయంలో డీసీపీ రష్మి పెరుమాలళ్, అడిషనల్ డీసీపీ పగడాల అశోక్ తో కలిసి మీడియాకు వివరాలు వెల్లడించారు.

హయత్ నగర్ బంజారా కాలనీలో నివాసముండే వళ్లపు వినోద్, బండారి వీరన్న, వేముల శ్రీను, గుంజ రాములు, వేముల రాజేష్, గోగుల వినోద్, వేముల ఏసు, వేము నాగరాజు, వల్లపు వినయ్, వేముల శ్రీను, వేముల సైదులు, గుంజ కృష్ణ, బండారి ప్రవీణ్, ఒంటి పులి రాంబాబులు మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు చెందినవారు. బంజారా కాలనీలో నివాసమంటూ బీఎస్ఎన్ఎల్ అండర్ గ్రౌండ్ కమ్యూనికేషన్ కేబుల్ వైర్లను అమర్చేందుకు అవసరమైన రోడ్డు కటింగ్, రోడ్డు డిగ్గింగ్ పనిలో కూలీలుగా పనిచేస్తున్నారు. అయితే కూలీలుగా వచ్చే సంపాదన సరిపోకపోవడంతో తాము పనిచేస్తున్న సంస్థలోని కాపర్‌వైరును దొంగలించి డబ్బులు సంపాదించాలని ప్లాన్ వేసుకున్నారు. అందులో భాగంగా మీరంతా బీఎస్ఎన్ఎల్ వర్కర్ల లాగా సంస్థకు చెందిన రిఫ్లెక్ట్ జాకెట్లు ధరించి రాత్రి సమయంలో ఆటోలో తిరుగుతూ యథేచ్ఛగా కేబుల్ వైర్లు కట్ చేసి ఎతికెళుతున్నారు. ఇలా దొంగిలించిన కేబుల్ నుంచి కాపర్ వైర్లు తీసి దాన్ని హయత్‌నగర్ ముదిరాజ్ కాలనీలో స్క్రాప్ బిజినెస్ చేస్తున్న కేతావత్ రమేష్ నాయక్, పెద్ద అంబర్‌పేట్ కు చెందిన కొల్లియాల సత్యనారాయణలకు విక్రయించి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారు. ఇలా వీరు కుషాయిగూడ, బోయిన్‌పల్లి,ఖార్కానా, అబ్దుల్లాపూర్ పేట్ ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ వైర్లు దొంగిలించారు. బోయిన్ పల్లి ప్రాంతంలో సమాచార వ్యవస్థ దెబ్బతిన్నట్లు గుర్తించిన అధికారులు ఆ ప్రాంతంలో చెక్ చేయగా, కేబుల్ వైరు చోరీకి గురైనట్టు గుర్తించారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు ఈనెల 13న బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బోయిన్‌పల్లి సెంటర్ పాయింట్ నాలా ప్రాంతంలోని సీసీ కెమెరాలు ఫుటేజీని పరిశీలించారు. అనంతరం సోమవారం తాడ్‌బండ్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ ప్యాసింజర్ ఆటోలో, రెండు బైకులపై వెళుతున్న వారు అనుమానాస్పద స్థితిలో కనిపించగా వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారు. వారి వద్ద నుంచి రూ.10 లక్షల విలువైన 120 కేజీల కాపర్ వైరు, ఒక ఆటో, రెండు బైకులను, కేబుల్ వైర్లను కట్ చేసేందుకు ఉపయోగించిన పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా చోరీకి ప్రధాన సూత్రధారి బండారి రమేష్, మరో ఇద్దరు సభ్యులు మక్కల వినోద్, రాలొల్లు మహేష్ లు పరారీలో ఉండగా వారికోసం గాలిస్తున్నట్టు డీసీపీ వెల్లడించారు.ఈ సమావేశంలో బేగంపేట ఏసీపీ గోపాలకష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మినారానాయణ, డీఐ సర్దాన్ నాయక్ పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దు



- కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సోమవారం బోరబండాలోని పలు బస్తీలలో జి.హెచ్.ఎం.సి అధికారులతో కలిసి, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ పర్యటించారు. ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, ఇంకా రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రజలకు కార్పొరేటర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జి.హెచ్.ఎం.సి ఏ.ఈ. భరత్, జీహెచ్ఎంసీ, టీజీసీపీడీసీఎల్, ఇతర విభాగాల అధికారులు అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు.

9న హాలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్.. చలో కేయు

- కోదండరాంకు సత్కారం
- డా.పరశురాం

నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే ఎమ్మెల్సీగా నియామకం అయిన ప్రో.కోదండరాంకు ఈ నెల 9న కాకతీయ యూనివర్సిటీలో యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కాంట్రాక్టు తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కార సభను నిర్వహించనునట్టు రాష్ట్ర అధ్యక్షుడు డా.ఎ. పరశురాం వర్కింగ్ ప్రెసిడెంట్స్ డా.కరుణాకర్ రావు , డా.యం. జితేందర్ రెడ్డి లు ఒక ప్రకటన లో పేర్కొన్నారు. ఈ కార్యక్ర మానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ తరలి రావాలని పిలుపునిచ్చారు.

మంకీపాక్స్‌తో జాగ్రత్తగా ఉండాలి

- అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మల్లా దేవి వినయ



నవతెలంగాణ- జూబ్లీహిల్స్.

మంకీపాక్స్ తో జాగ్రత్తగా ఉండాలని అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ (కొండాపూర్) జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మల్లా దేవి వినయ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మంకీపాక్స్ వ్యాప్తిని దష్టిలో పెట్టుకొని జూబ్లీహిల్స్ అపోలో హాస్పిటల్ లో ఒక ప్రకటన విడుదల చేసింది. మంకీపాక్స్ ను ఇప్పుడు ఎంపాక్స్ అంటున్నారని పేర్కొన్నారు. ఇది ఎంపాక్స్ వైరస్ వల్ల కలిగే వైరల్ జూనోటిక్ ఇన్‌ఫెక్షన్ అన్నారు. ఇది మశూచి వలే దద్దుర్లు కలిగి ఉంటుందన్నారు. వ్యక్తి నుంచి వ్యక్తికి వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మరణాలు తక్కువగా ఉన్నాయని, కానీ చిన్న పిల్లలు, గర్భిణులు, రోగ నిరోధక శక్తి తక్కువ ఉన్న వారిలో తీవ్రంగా ఉంటుందని పేర్కొన్నారు. జంతువు నుంచి మనిషికి.. ఇది సోకిన జంతువుల శరీర ద్రవాలు ఇతరత్రా ద్వారా సోకుతుందన్నారు. ఇక మనిషి నుంచి మనిషికి పుండ్లు, స్కాబ్స్, శరీర ద్రవాలు, శ్వాసకోశ స్రావాల ద్వారా అంటుకుం టుందని తెలిపారు. ఒక వ్యక్తికి ఈ వైరస్ సోకిన తర్వాత లక్షణాలు కనిపించడానికి సాధారణంగా 5 నుంచి 13 రోజులు పడుతుందని పేర్కొన్నారు. అయితే, కొన్నిసార్లు 4 రోజులకు తగ్గవచ్చని, లేదా 21 రోజులకు పెరగవచ్చని తెలిపారు. ఈ సమయం వ్యాధి తీవ్రతపై ఆధారపడి ఉంటుందన్నారు. జ్వరం, తలనొప్పి, గొంతు నొప్పి, వెన్నునొప్పి, అలసట ఒకటి నుంచి ఐదు రోజులు ఉంటుందని తెలిపారు. సాధారణంగా దద్దుర్లు నొప్పితో కూడి ఉంటాయన్నారు. ఇవి సాధారణ లక్షణాలు కనిపించడానికి ఒకట్రెండు రోజుల ముందు గానీ, తర్వాత గానీ కనిపిస్తాయన్నారు. ఈ దద్దుర్లు రెండు మూడు వారాలు ఉంటాయన్నారు. వివిధ దశలలో (మాక్యుల్స్, పాప్యుల్స్, వెసికల్స్, సుడా-పుస్టుల్స్, క్రస్ట్) అభివద్ధి చెందుతాయని తెలిపారు. కొంతమంది రోగులలో ప్రాక్టిటిస్, కంటి సమస్యలు, నరాల సంబంధిత లక్షణాలు కూడా కనిపిస్తాయని పేర్కొన్నారు. మంకీపాక్స్ చికిత్సకు నొప్పి నివారణ మందులు, మూత్రం సాఫీగా ఉండేందుకు సహాయపడే మందులు, ప్రాక్టిటిస్ కోసం టాపికల్ లిడోకైన్, సిట్జ్ బాత్‌లు వాడాలన్నారు. టెకోవిరిమాట్, సిడోఫోవిర్, బ్రింసిడోఫోవిర్ తదితర మందులు తీవ్రమైన కేసులలో వాడాలని తెలిపారు. ఆరోగ్య సంరక్షణ సిబ్బందికి వ్యక్తిగత రక్షణ పరికరాలు (పీపీఈ) ఇవ్వాలన్నారు. చర్మంపై ఉన్న గాయాలను కవర్ చేసుకోవాలన్నారు. వ్యక్తిగత వస్తువులను పంచుకోవడం మానుకోవాలని, ఫేస్‌మాస్క్‌లను ధరించాలని కోరారు. రోగికి ఇతరులతో ఎటువంటి సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచాలన్నారు. ఇలా రెండు నుంచి మూడు వారాలు ఉంచాలన్నారు. అనంతరం ఐసోలేషన్ నుంచి బయటకు రావచ్చని తెలిపారు.

హరిజన బస్తీలో పర్యటించిన ఎమ్మెల్యే మాధవరం



నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయిన్ చెరువు బాధితులు హరిజన బస్తీ వాసులను సోమవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ నరసింహా యాదవ్ కలిసి పరామర్శించారు. వారితో మాట్లాడుతూ వారిలో ఉన్ భయాన్ని తొలగించారు వారి ఇండ్లు పోకుండా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు ఎలాంటి సమస్య వచ్చినా సమీపంలో కార్పొరేటర్ దష్టికి, తనకు చెప్పాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మార్కెట్ చైర్మెన్ నరేందర్ గౌడ్, సీనియర్ నాయకులు కర్ర జంగయ్య, మాజీ కౌన్సిలర్ మక్కల నరసింహ, నియోజకవర్గ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల తనిఖీ

డివిజన్‌లోని దవఖానాల పనితీరును సోమవారం ఎమ్మెల్యే మాధవనం కష్ణారావు, కార్పొరేటర్ ముద్దం పరిశీలించారు. ఆస్పత్రిలో రోజువారీగా ఎంతమంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని ఆరా తీశారు. డెంగ్యూ కేసులు ఏమైనా వస్తున్నాయా.. సరిపడే మందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని అడిగారు. శాంతినికేతన్ కాలనీ దవాఖానాలో స్టాఫ్ తక్కువ ఉన్నారని, డాక్టర్ సరిగ్గా రావట్లేదని స్థానికులు ఎమ్మెల్యేకు తెలిపారు.



విత్తన గణేశ్ విగ్రహాల పంపిణీ

- 10,000 విత్తన గణేశ ప్రోస్పెరిటీ బాక్స్‌లను పంపిణీ చేసిన ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ విక్రయదారులు, రిఫైనర్స్ జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా) స్థిరమైన, పర్యావరణ అనుకూల పద్ధతులను ప్రోత్సహించే తమ ప్రయత్నాలలో భాగంగా 10,000 పర్యావరణ అనుకూల విత్తన గణేశ బాక్స్ లను పంపిణీ చేస్తున్నది. వాతావరణ మార్పుల ప్రతికూలతల గురించి ప్రజలు అవగాహన పొందుతున్నారు. పర్యావరణ అనుకూల గణేశుడిని పూజించడం ద్వారా పర్యావరణ అనుకూల మతపరమైన వేడుకలను వేగంగా స్వీకరిస్తున్నారు. ఈ విగ్రహాల నిమజ్జనం నీటి వనరులపై ఎటువంటి ప్రమాదకర ప్రభావాన్ని చూపనందున, దీన్ని ప్రోత్సహించడానికి ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ హైదరాబాద్‌లో 7,000 పర్యావరణ అనుకూల విత్తన గణేశ బాక్స్ లను, బెంగళూరులో 3,000 పర్యావరణ అనుకూల విత్తన గణేశ బాక్స్‌లను పంపిణీ చేస్తున్నది. రెయిన్‌బో విస్టా (ఫేజ్ 1 అండ్ 2), మలేషియా టౌన్‌షిప్, అపర్ణ సరోవర్, ఎన్‌సీసీ అర్బన్ మాదాపూర్, స్వాన్‌లేక్ అపార్ట్‌మెంట్, మూసాపేట్, రిడ్జ్ టవర్స్, ఐడీపీఎల్ , మై హెూమ్ జ్యువెల్, ఇండిస్ వన్ సిటీ కేపీహెచ్‌బీ, శాటిలైట్ టౌన్‌షిప్, కొంపల్లి, సత్యనారాయణ ఎన్‌క్లేవ్ చందా నగర్ మొదలైనవి. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లకు పర్యావరణ అనుకూలమైన విత్తన వినాయకుడిని పంపిణీ చేయడానికి శ్రీ చేతన్ పింపాల్‌ఖుటే, డీజీఎం మార్కెటింగ్, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ బందంతో కలిసి వాహనాలను ప్రారంభించారు.

ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేయబడిన గణేశ్ విగ్రహాలు నీటిలో నిమజ్జనం చేసిన తర్వాత నీటిలో కరగటానికి, ఆ రసాయనాలు, పదార్థాలను నీటి నుంచి తొలగించబడటానికి సమయం పడుతుంది. పర్యావరణంపై చైతన్యం పెరగడంతో కత్రిమ రంగులు వేయని మట్టి విగ్రహాలకే ఇటీవల కాలంలో ప్రజలు మొగ్గు చూపుతున్నారు. గణేష్ ఉత్సవాల వల్ల కలిగే పర్యావరణ ప్రభావాన్ని కనిష్టంగా ఉంచడానికి, మట్టి, కరిగే గణేష్ విగ్రహాలను సేంద్రీయ ఎరువులు, మొక్కలు ఎదిగే సామర్థ్యం గల విత్తనాలతో కూడి ఉన్నవాటిని ప్రజలు తీసుకోవడం ప్రారంభించారు. ఒకసారి కుండలో నిమజ్జనం చేస్తే, విగ్రహాలలో లభించే విత్తనాలతో గణేష్ విగ్రహం ఒక మొక్కగా పెరుగుతుంది. ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ - గ్రీన్ గణేశ కార్యక్రమం ఉత్సవాలలో రాజీ పడకుండా పర్యావరణ హానిని తగ్గించడానికి వారు చేస్తున్న ప్రయత్నం విజయవంతం అయింది. ఈ సందర్భంగా, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ సేల్స్ అండ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీ పి చంద్ర శేఖర రెడ్డి ఈ కార్యక్రమం గురించి మాట్లాడుతూలి, "మన ఇండ్లల్లో గణేశుడి విగ్రహాన్ని ఉంచడం ద్వారా పండుగ జరుపుకోవడం మన సంప్రదాయంలో ఒక భాగం. ప్రజలు సంప్రదాయ ఉత్సాహంతో పండుగను జరుపుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించడానికి, ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయిల్స్ 10,000 పర్యావరణ అనుకూలమైన విత్తన గణేశ విగ్రహాలను పంపిణీ చేయాలని నిర్ణయించింది. మేము 5 సంవత్సరాలుగా పర్యావరణ అనుకూలమైన విత్తన గణేశ విగ్రహాలను పంపిణీ చేస్తున్నాము. గ్రీన్ గణేశ కార్యక్రమంతో మేము ప్రజలకు పండుగను సాంప్రదాయ ఉత్సాహంతో స్థిరమైన, పర్యావరణ అనుకూల మార్గంతో వేడుక జరుపుకోవడానికి స్వేచ్ఛను ఇస్తున్నాము" అని అన్నారు.



సకాలంలో ధ్రువీకరణ పత్రాలు మంజూరు

● నాంపల్లి డిప్యూటీ తహశీల్దార్ విశ్వేశ్వర్



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

నాంపల్లి రెవెన్యూ మండల పరిధిలో దరఖాస్తుదారులకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను సకాలంలో మంజూరు చేస్తున్నామని నాంపల్లి మండల డిప్యూటీ తహశీల్దార్ బి.విశ్వేశ్వర్ తెలిపారు. సోమవారం నాంపల్లి మండల కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవలే తాను నూతనంగా బాధ్యతలు తీసుకున్నట్టు తెలిపారు. మండల పరిధిలోని ప్రజలు దరఖాస్తు చేసుకున్న కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలను సత్వరమే మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా ఆన్‌లైన్ ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెంటనే పరిశీలించి, విచారణ జరిపిన అనంతరం అర్హులకు సత్వరమే పత్రాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు.

సేవా భావంతో విధులు నిర్వర్తించాలి

● గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్ శమంతకమణి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి గ్రేడ్ వన్ నర్సింగ్ సూపరింటెండెంట్‌గా శమంతకమణి ఇటీవలె బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆమె చాంబర్‌లో మాట్లాడుతూ.. ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించాలని నర్సింగ్ ఉద్యోగులకు సూచించారు. వైద్యం (చికిత్స) తీసుకుంటున్న రోగుల పట్ల సేవ భావంతో విధులు నిర్వహిస్తూ సేవలు అందించాలని సూచించారు. డ్రెస్ కోడ్ మెయింటైన్ చేయాలని సూచించారు. రోగులను కంటికి రెప్పలాగా చూసుకోవాలన్నారు. ఏలాంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నగరంలో 9 సెంటీమీటర్ల వర్షం

596 శిథిలావస్థలో గల భవనాల గుర్తింపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాలు నగరాన్ని అతలాకుతలం చేస్తోంది. నగరంలో 9 సెంటీమీటర్ల మేరక వర్షం కురియడంతో అనేక ప్రాంతాలను వరదలు ముంచెత్తాయి. వీధులు, కాలనీలు చెరువులను, జలాశయాలను తలపిస్తున్నాయి. కొన్ని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో పలు చోట్ల ప్రధాన రహదారులపై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎగువ నుంచి వస్తున్న వరద ప్రవాహంతో జంట జలాశయాలు ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌తో పాటు హుస్సేన్ సాగర్‌లోకి పెద్దఎత్తున్న వరద నీరు చేరుతోంది. భారీవర్షాల నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, వాటర్ బోర్డు, పోలీస్ శాఖ, హైడ్రా తదితర శాఖలు 24/7 పనిచేస్తున్నాయి. స్టాటిస్టిక్స్ ఎమర్జెన్సీ టీములు, డీఆర్‌ఎఫ్ టీములను రంగంలోకి దించారు. 141 లొకేషన్‌లలో 242 ఎమర్జెన్సీ టీమ్స్, 157 మొబైల్ టీమ్స్, 30 డీఆర్‌ఎఫ్ బృందాలు పనిచేస్తున్నాయి. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ 7 ఎమర్జెన్సీ టీములు, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లకు నాలుగు చొప్పున అదనపు ఎమర్జెన్సీ టీంలను కేటాయించారు. జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌లో 12 మంది, డీఆర్‌ఎఫ్ కంట్రోల్ రూమ్‌లో 10 మందితో కూడిన బందాలు నిరంతరం పనిచేస్తున్నాయి. నగరంలో అత్యధిక వర్షపాతం 9 సెంటీమీటర్లు కురియడంతో వాటర్ స్టాగ్నేషన్ కన్నా ఎక్కువగా చెట్లు పడిపోయాయి. వాటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. అధికారులందరూ క్షేత్ర పరిధిలో ఉండి ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా జీహెచ్‌ఎంసీ అనుబంధ శాఖలు సమన్వయంతో ముందుకెళున్నాయి. ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌కు వాటర్ స్టాగ్నేషన్‌కు సంబంధించి దాదాపు 150కిపైగా ఫిర్యాదులు రాగా, వాటిని క్లియర్ చేశారు. అదేవిధంగా చెట్లు పడిపోయిన సంఘటనలకు సంబంధించి 140 ఫిర్యాదులు అందడంతో వాటిని తొలిగించారు. 596 శిథిలావస్థలో గల భవనాలను గుర్తించిన అధికారులు, 344పై చర్యలు తీసుకున్నారు. 129 భవనాలను ఖాళీ చేయించారు. మరో నాలుగింటికి సీల్ వేశారు. 107 వాటర్ ట్యాంకుల మరమ్మత్తులు సంబంధిత యజమానులతో చేయించారు.

అవసరమైతేనే బయటకు రండీ

మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

గత మూడు రోజులుగా నగరంలో కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని శాఖల సమన్వయంతో జీహెచ్‌ఎంసీ యంత్రాంగం మొత్తం క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌ను సోమవారం మేయర్ ఆకస్మికంగా సందర్శించి, ఓఎస్డి అనురాధను వివరాల అడిగి తెలుసుకున్నారు. నగరంలో పడిన వర్షపాతం, అత్యధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలు, వచ్చిన ఫిర్యాదులు, పరిష్కరించినవి, హుస్సేన్ సాగర్, హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌ల నీటి మట్టాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో మాడరేట్ వర్షాలు మాత్రమే కురిసాయని, వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ ప్రకటించిన నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీహెచ్‌ఎంసీ కమిషనర్ మొదలు అన్ని స్థాయిల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. నగరంలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. వర్షంలో చిన్న పిల్లలు, వద్ధులు ఒంటరిగా రోడ్డుపైకి వెళ్లవద్దని, అవసరమైతేనే బయటకు రావాలని కోరారు. ఏదైనా సహాయానికి జీహెచ్‌ఎంసీ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేయాలని ప్రజలను కోరారు. వర్షాలు పడిన తర్వాత వైరల్ ఫీవర్లు, ఇతర వ్యాధులతో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉన్నందున హెల్త్ క్యాంప్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాలు పూర్తిస్థాయిలో తగ్గేవరకు అందరూ అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీసీపీ శ్రీనివాస్, (యూబీడీ) అడిషనల్ కమిషనర్ సునంద, కంట్రోల్ రూమ్ ఓఎస్‌డి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

వృర్థాలకు సరికొత్త రూపు..

● ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. అప్పియ చిన్నమ్మ



నవతెలంగాణ-ధూల్‌పేట్

వ్యర్థాలను బయట వేయకుండా వాటితో కొత్తకొత్త వస్తువులు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలని హుస్సేని ఆలం ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. అప్పియ చిన్నమ్మ అన్నారు. హుస్సేనీ ఆలం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఇకో క్లబ్ ఆధ్వర్యంలో బెస్ట్ అవుట్ ఆఫ్ వేస్ట్ వ్యర్థపదార్థాల నుంచి ఉత్తమ సృజనాత్మక వస్తువులను సృష్టించడం అనే అంశం మీద (ఎగ్జిబిషన్)ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె మాట్లాడుతూ.. వ్యర్థాలను తీసుకొని సరికొత్త రూపు తీర్చిదిద్ది నైపుణ్యతను విద్యార్థులు కనబరుస్తున్నారన్నారు. ఇలా విద్యార్థుల్లో ఆలోచనల్లో మార్పు, మనోవికాసాన్ని పెంపొందిస్తాయన్నారు. దీంతో వారి ప్రతిభను ప్రతిబింబిస్తుంటారని పేర్కొన్నారు. విద్యార్థులు వాడిన వేస్ట్ న్యూస్ పేపర్స్, వుడెన్, అట్టముక్కలను ఉపయోగించి వివిధ రకాల సృజనాత్మక వస్తువులను, పూలకుండీలను, పెన్ స్టాండ్స్, పోస్టర్‌ను తయారు చేసి ప్రద ర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర అధ్యాపకులు డాక్టర్ పి.లత, వి.సునీత, కె.విద్యాధరి, కె.శ్రీదేవి, వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అబ్దుల్ కరీమ్‌ను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

మొహమ్మద్ అబ్దుల్ కరీమ్‌ను ఉద్యోగులు ఆదర్శంగా తీసుకొని పని చేయాలని ఇన్కమ్ టాక్స్ శాఖ అడిషనల్ కమిషనర్ శాంతా కుమారి అన్నారు. డిప్యూటీ కమిషనర్ టాక్స్ ఆఫీసర్‌గా పదవి విరమణ సందర్భంగా మొఘల్‌పురాలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అబ్దుల్ కరీమ్ ఉద్యోగంతో పాటు సామాజిక కార్యక్రమాలు చేస్తూ పేద ప్రజలకు ఆదుకుంటున్నారన్నారు. అనంతరం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, మౌలానా జమలూరు రెహమాన్, రిజవాన్ పాషా ఖాద్రి, సోఫి సయ్యద్ షా ఖైరుద్దీన్ ఖాద్రి, నవాజుద్దీన్, మొహమ్మద్ మూర్తుజా అలీ, ముఫ్తీ ఫయాజ్, హబీబుర్ రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కచ్చా నాలా నూతన పైప్‌లైన్ పనులు

● కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

భారీగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కోరారు. వరద నీటి సమస్య శాశ్వత పరిష్కారానికై కచ్చా నాలా నూతన పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ తెలిపారు. భారీ వర్షాల వలన డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలను కార్పొరేటర్ పర్యటించారు. బస్తీల్లో ఇండ్ల మధ్య రోడ్లపై నిలిచి పోతున్న వరదనీరు కారణంగా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, వాటి సమస్యలపై ప్రత్యేక దృష్టి వహించి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, జలమండలి అధికారులకు సూచించారు. ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ లోని జవహర్ నగర్ వద్ద జరుగుతున్న కచ్చనాలా నూతన పైప్ లైన్ పనులను పర్యవేక్షించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, అసిస్టెంట్ ఇంజినీర్ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, జలమండలి డిప్యూటీ జనరల్ మేనేజర్ కార్తీక్ రెడ్డి, మేనేజర్ కృష్ణ మోహన్ సూపర్వైజర్ శంకర్,మల్లేష్ , బీజేపీ నాయకులు శ్రీకాంత్, సురేష్, నవీన్ కుమార్, సాయి కుమార్, దొనేటి సత్యం, ఆనంద్ రావు, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ప్రాధాన్యత ఇవ్వండి

ఐపీఎం బ్లడ్ బ్యాంక్ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి



నవతెలంగాణ-అంబర్‌పేట

రక్తదానానికి అధిక ప్రాధాన్యత ఇచ్చి ఇతరులకు ప్రాణదానాన్ని నిలబెట్టాలని ఐపిఎం బ్లడ్ బ్యాంక్ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి అన్నారు. సోమవారం ఐపీఎంలో ఆమె మాట్లాడుతూ సీజన్ వ్యాధుల పట్ల వాతావరణం లో మార్పుల వలన చాలామంది అనారోగ్యం బారిన పడుతున్నారని వారికి కావాల్సిన బ్లడ్ కావాలని గాంధీ ఉస్మానియా ఆస్పత్రి నుంచి చాలామంది పేషెంట్లు బ్లడ్ గురించి ఎదురుచూస్తున్నారని ముందు జాగ్రత్తగా బ్లడ్ కొరత ఏర్పడక ముందే ప్రతి ఒక్కరూ సేవాభావంతో స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఘనంగా శ్రావణమాస వేడుకలు..

నవతెలంగాణ-ధూల్‌పేట్

శ్రావణమాస చివరి రోజు పురస్కరించుకొని శ్రావణమాస వేడుకలు గౌడ్ ధర్మకర్తల పాలక మండలి ప్రతినిధులు ఘనంగా నిర్వహించారు. జియాగూడ పరిధిలోని గౌండ్ల మఠంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో మండలి అధ్యక్షులు గోడిశాల నరేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొత్త నవీన్ కుమార్ గౌడ్, సలహాదారుడు నిర్మల నీలకంఠం గౌడ్ లు మాట్లాడుతూ.. ప్రతి ఏటా మాదిరి ఆలయంలో సురబందేశ్వరా, కాత్యాయనీ దేవి లకు ప్రత్యేక పూజలు నిర్వహించి కౌండిన్య హాల్ లో భక్తులకు మహా అన్నదానం కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారుడు బుర్ర భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులు గడ్డమీది యాగ్నేశ్వర్ గౌడ్, కోశాధికారి నిర్మల మనుజేందర్ గౌడ్, కార్య నిర్వాహక కార్యదర్శి పంజాలా అశోక్ కుమార్ గౌడ్, గోదా వెంకటేష్ గౌడ్, దేశం శంకర్ హరి ప్రసాద్ గౌడ్, సాయినాథ్ గౌడ్,కొత్త ప్రవీణ్ కుమార్ గౌడ్, మల్లం శివ కుమార్ గౌడ్, గడ్డ మీది నాగేందర్ గౌడ్, నిర్మల ప్రవీణ్ కుమార్ గౌడ్, బి. అశోక్ గౌడ్, కె. శ్రీనివాస్ గౌడ్, ఎం. మధుసూదన్ గౌడ్, ఏ. శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రొఫెసర్ కోదండరాంకు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ ఉద్యమ రథసారథి, తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం శాస నమండలి సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా ఈనెల 4న ఆత్మీయ పౌర సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసి నట్లు గ్రేటర్ హైదరా బాద్ తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ఎం.నరసయ్య వెల్లడించారు. సోమవారం ముషీరాబాద్ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో గాంధీ నగర్‌లో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసయ్య హాజరై మాట్లాడుతూ కోదండ రాంకు సన్మానం అంటే తెలంగాణ సమాజానికి సన్మానం చేసినట్లుగా భావిస్తూ సన్మాన సభ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ కట్ట మైసమ్మ దేవాలయం నుంచి ఇందిరా పార్క్, బీమా మైదానం,అశోక్ నగర్, గాంధీ నగర్ ,ఆర్టీసీ క్రాస్ రోడ్స్ మీదుగా భారీ ర్యాలీని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ర్యాలీ వెళ్లే దారి పొడవునా పౌర సమాజం కోదండ రాముకు స్వాగత ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ముషీరాబాద్ ఉద్యమకారులు, తెలంగాణ ఉద్యమకారులు ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్ర మంలో తెలంగాణ జన సమితి గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి బట్టల రామచందర్ ,బీసీ సెల్ అధ్యక్షుడు ఎస్.జస్వంత్ కుమార్, గాంధీనగర్ డివి జన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్ , కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు అజయ్ గౌడ్, అడిక్ మెట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, ముషీ రాబాద్ అసెంబ్లీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటయ్య , నగర ఉపాధ్యక్షులు జయపాల్ రెడ్డి మానేపల్లి లక్ష్మణ్ , నాయకులు నగేష్, రాకేష్ పాల్గొన్నారు.

జలమండలిలో 13 మంది ఉద్యోగులు పదవీ విరమణ

● ఘనంగా సత్కరించిన అధికారులు



నవతెలంగాణ-సిటీబ్యూరో

జీవితంలో పదవీ విరమణ అనేది ఒక ముఖ్యమైన ఘట్టమని ఎండీ అశోక్ రెడ్డి అన్నారు. జలమండలి పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు జనరల్ మేనేజర్లు సహా 10 మంది ఉద్యోగులకు పదవీ విరమణ పొందారు. ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో సోమ వారం జరిగిన ఈ కార్యక్రమానికి ఎండీ అశోక్ రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడు తూ జలమండలి లాంటి అత్యవసర సేవల విభాగంలో పనిచేసిన వారికి కుటుంబసభ్యులతో సమయం గడిపే అవకాశం చాలా తక్కువగా ఉంటుందన్నారు. ఉద్యోగ రీత్యా కుటుంబ సభ్యులతో గడపలేని వాళు రిటైర్మెంట్ తర్వాత ఆ లోటును పూడ్చుకోవచ్చన్నారు. జలమండలి ఈడీ మాట్లాడుతూ జలమండలిలో సుదీర్ఘంగా సేవలు అందించి పదవీ విరమణ పొందిన అందరికీ భవిష్యత్తులో మరింత సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన వారిని అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో సీజీఎం మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, జీఎం సరస్వతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వాలు ఆదుకోవాలి

● ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) మహాసభ డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైందని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర మహాసభ ఆవేదన వ్యక్తం చేసింది. వర్షాలు, వరదలతో నష్ట పోయిన ప్రజలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని మహాసభలో పీఓడబ్ల్యు రాష్ట్ర అధ్యక్షులు జి.ఝాన్సీ డిమాండ్ చేశారు. సోమవారం బాగ్‌లింగం పల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రగతిశీల మహిళా సంఘం 7వ మహాసభ మూడో రోజులుగా జరుగుతున్నాయి. మూడో రోజు మహాసభలో భాగంగా మహిళా సంఘం ప్రణాళికను రాష్ట్ర ఉపాధ్యక్షులు అనసూయ ప్రవేశ పెట్టారు. మహాసభ కూలంకషంగా చర్చించి, కొన్ని సవరణలతో ఆమోదించింది. తర్వాత రెండో సెషన్‌లో గత మహా సభలలో జరిగిన కార్యక్రమాల రిపోర్ట్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగళ ప్రద వివరించారు. మహాసభ ఈ కార్యక్రమాల రిపోర్ట్‌ను సమీక్షించి, చర్చించి ఆమోదించింది. భవిష్యత్‌లో చేయాల్సిన కార్యక్రమాలను చర్చించి తీర్మానాలు చేసింది. మహాసభలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు జీ. ఝాన్సీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వలన జనజీవనం స్తంభించిపోయిందన్నారు. వరదలతో నష్టపోయిన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని వరద ప్రవాహక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు ముమ్మరం చేసి చని పోయిన వారికి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళలపై హింస గతం కంటే 6% పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలపై హింసకు కారణమైన అశ్లీల సంస్కృతి, మద్యం, మనువాద భావ జాలానికి వ్యతిరేకంగా పోరాడాలని తీర్మానించింది. మహిళలపై పెరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళ లపై హింసకు కారణమైన మద్యం ,అశ్లీల సంస్కృతి మనువాద భావజాలాన్ని నిషేధించాలని కోరారు. కార్మిక రంగంలో సమాన పనికి సమాన వేతనం, పనిచేసే చోట క్రషలను ఏర్పాటు చేయాలని మహిళ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభలో పి ఓ డబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందే మంగళ ప్రద,అనసూయ, డా.సరిత పిట్ల, జ్యోతి, సీత, గీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీపీ పనుల పరిశీలన



నవతెలంగాణ-అంబర్‌పేట

గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంబర్‌పేట నాలా ఎస్టిపి పనులను సోమవారం అంబర్‌పేట కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ గౌడ్ స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా విజయకుమార్ గౌడ్ మాట్లాడుతూ ఎస్టిపి నాలను విస్తరించినందుకు పటేల్ నగర్, ప్రేమ్ నగర్ తదితర ప్రాంతాలలో బస్తీలు ఎలాంటి ముంపునకు గురి కాకుండా ఉన్నాయని ఎస్టీపిని ఎప్పటికప్పుడు క్లీనింగ్ అయ్యే విధంగా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

పోషకాహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జాతీయ పోషకాహార మాస ఉత్సవాలను ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జీష్ణు దేవ్ వర్మ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

